


వరంగల్ వార్త

వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జయశంకర్, జనగామ, ములుగు

బుధవారం 08, ఏప్రిల్ 2026 16 పేజీలు




## పాములూరులో నూతన శకానికి

# నాంది..!

డీజీపీ శివధర్ రెడ్డి

2లో

### బేస్ క్యాప్ అవుట్ పోస్ట్ నిర్మాణానికి శంకుస్థాపన

### పర్యావరణానికి హాని కలగకుండా రహదారుల నిర్మాణం చేపట్టాలి

### రాష్ట్ర ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆఫీసర్ సువర్ణ

**ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో ప్రభాత వార్త,** తెలంగాణ చత్తీస్గడ్ సరిహద్దుల్లో ఉన్న పాములూరు కర్రెగుట్టల ప్రాంతంలో మంగళవారం డీజీపీ శివధర్ రెడ్డి పర్యటించారు. తెలంగాణను మావోయిస్టు రహిత రాష్ట్రంగా ప్రకటించిన తర్వాత అత్యంత సున్నితమైన ఈ ప్రాంతంలో డీజీపీ పర్యటించడం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పర్యటనతో తెలంగాణ రాష్ట్రంలో మావోయిస్టులు లేరు అనే బలమైన సంకేతం ఇచ్చినట్లు ఉంది. హెలికాప్టర్ ద్వారా పాములూరు ప్రాంతానికి విచ్చేసిన డీజీపీ శివధర్ రెడ్డి కి, సిసిఎఫ్ఓ సువర్ణ కి జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఘన స్వాగతం పలికారు. గిరిజనులతో మమేకమైన డీజీపీ శివధర్ రెడ్డి. ఈ పర్యటనలో పాములూరు గుత్తికోయలతో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.



2లో

## హెల్మెట్ భారం కాదు.. భాధ్యత

అరైవ్ అలైవ్‌తో ప్రమాదాలకు చెక్

హెల్మెట్-సీట్ బెల్ట్ తప్పనిసరి అని సూచన

వార్తా దినపత్రిక 30వ వార్షికోత్సవ సందర్భంగా 200 హెల్మెట్ల పంపిణీ

డీజీపీ శివధర్ రెడ్డి చేతుల మీదుగా ద్విచక్ర వాహనదారులకి హెల్మెట్లు అందజేత



మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు : డీజీపీ శివధర్ రెడ్డి

### అస్తవ్యస్తంగా గ్రామాభివృద్ధి

## నిధుల వినియోగం...?



2లో

పిల్లల ఆటస్థలాలపై రోడ్లు ఇది అభివృద్ధేనా...!

క్రీడా ప్రాంగణం అని వ్రాసి ఉన్న పట్టించుకోని కాంట్రాక్టర్

ప్రజలకు ఉపయోగం లేని పనులతో ప్రజాధనం దుర్వినియోగం...!

సర్వాయిపేట గ్రామపంచాయతిలో ఉపాధి హామీ నిధులపై తీవ్రమైన ఆరోపణలు...!










# హెల్మెట్ భారం కాదు.. భాధ్యత

**డీజీపీ బత్తుల.శివధర్ రెడ్డి.**

**అరైవ్  అలైవ్‌తో ప్రమాదాలకు చెక్**

**హెల్మెట్-సీట్ బెల్ట్ తప్పనిసరి అని సూచన**

**వార్తా దినపత్రిక 30వ వార్షికోత్సవ సందర్భంగా 200 హెల్మెట్ల పంపిణీ**

**డీజీపీ శివధర్ రెడ్డి చేతుల మీదుగా ద్విచక్ర వాహనదారులకి హెల్మెట్లు అందజేత**

**మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వార్త యాజమాన్యాన్ని అభినందించిన డిజిపి**

**ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో, ప్రభాతవార్త:** ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో "అరైవ్ అలైవ్" రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలకు రోడ్డు భద్రతపై కీలక సూచనలు చేశారు. డీజీపీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. పిలియన్ రైడర్ కూడా హెల్మెట్ పెట్టుకోవడం అత్యవసరమని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనం నడపరాదని, ట్రిపుల్ రైడింగ్ చేయకూడదని హెచ్చరించారు. నాలుగు చక్రాల వాహనాల్లో సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి అని సూచించారు. అధిక వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ ప్రమాదాలకు ప్రధాన కారణమని



తెలిపారు. ఓవర్‌టేక్ ఎల్లప్పుడూ కుడి వైపు నుంచే చేయాలని, లేన్ డిసిప్లిన్ పాటించాలని సూచించారు. యువతతో నేరుగా సంభాషిస్తూ హెల్మెట్ వినియోగంపై ప్రశ్నలు అడిగి అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం మాత్రమే కాకుండా దానిని సరిగా బిగించుకోవడం కూడా ప్రాణ రక్షణకు కీలకమని వివరించారు.

**వార్త దినపత్రిక 30వ వార్షికోత్సవం సందర్భంగా 200 హెల్మెట్ల పంపిణీ.**

200 హెల్మెట్లు డీజీపీ శివధర్ రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా వార్త ప్రతినిధులు పంపిణీ చేశారు. వార్తా దినపత్రిక 30వ వార్షికోత్సవం సందర్భంగా ఈ పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా పత్రిక యాజమాన్యం, రిపోర్టర్లు, పాఠకు లకు డీజీపీ శివధర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో స్పష్టమైన అవగాహన కల్పించడంలో ఈ కార్యక్రమం కీలకంగా నిలిచింది. ట్రాఫిక్ నియమాలు పాటించి పోలీసులు అందించే సేవలకు సహకరించాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి ముందు పాముసూరు (కర్రెగుట్టలు) బేస్ క్యాంప్ అవుట్ పోస్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

## పాముసూరులో నూతన శకానికి నాంది

**డీజీపీ శివధర్ రెడ్డి.**

**బేస్ క్యాప్ అవుట్ పోస్ట్ నిర్మాణానికి శంకుస్థాపన.**

**పర్యావరణానికి హాని కలగకుండా రహదారుల నిర్మాణం చేపట్టాలి**

**రాష్ట్ర ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆఫీసర్ సువర్ణ.**

**ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో ప్రభాత వార్త,** తెలంగాణ చత్తీస్గడ్ సరిహద్దుల్లో ఉన్న పాముసూరు కర్రెగుట్టల ప్రాంతంలో మంగళవారం డీజీపీ శివధర్ రెడ్డి పర్యటించారు. తెలంగాణను మావోయిస్టు రహిత రాష్ట్రంగా ప్రకటించిన తర్వాత అత్యంత సున్నితమైన ఈ ప్రాంతంలో డీజీపీ పర్యటించడం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పర్యటనతో తెలంగాణ రాష్ట్రంలో మావోయిస్టులు లేరు అనే బలమైన సంకేతం ఇచ్చినట్లు ఉంది. హెలికాప్టర్ ద్వారా పాముసూరు ప్రాంతానికి విచ్చేసిన డీజీపీ శివధర్ రెడ్డి కి, సిసిఎఫ్ఓ సువర్ణ కి జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఘన స్వాగతం పలికారు. గిరిజనులతో మమేకమైన డీజీపీ శివధర్ రెడ్డి. ఈ పర్యటనలో పాముసూరు గుత్తికోయలతో  కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. గిరిజన ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని, పరిష్కారం చేస్తామని డీజీపీ హామీ ఇచ్చారు. అనంతరం పాముసూరుకు చెందిన 7 కుటుంబాలకు కలిపి ఒక ఆటో, ఒక ద్విచక్ర వాహనం మరియు నెలకు సరిపడా అవసరమైన సరుకులను డీజీపీ గారు అందజేశారు. ప్రకృతి అందాలకు ప్రసిద్ధి చెందిన కర్రేగుట్టలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పర్యాటకులకు భద్రత కల్పించేందుకు పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయడానికి శంకుస్థాపన చేశారు. అలాగే అటవీ, రెవిన్యూ, సీఆర్పీఎఫ్ మరియు పోలీస్ శాఖల మధ్య సమన్వయాన్ని పెంచేందుకు సమన్వయ కేంద్రాన్ని ఏర్పాటు చేసారు. గుత్తికోయ గుడాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వారికి  వివరించారు. పోలీసుల పట్ల గుత్తి కోయలకు నమ్మకాన్ని పెంచేలా ఈ కార్యక్రమం సాగింది. రహదారి వెంట జరుగుతున్న అభివృద్ధి పనుల వల్ల స్థానికులకు కలిగే ప్రయోజనాలపై అవగాహన  కల్పించారు. దుర్గమమైన అటవీ ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణం చేపట్టడం ద్వారా రవాణా వ్యవస్థ మెరుగుపడటమే కాకుండా భద్రతా పరమైన అంశాల్లో పురోగతి కనిపిస్తుందని, కేంద్ర బలగాల పర్యవేక్షణలో జరిగిన పనులను అభినందించారు. అటవీ శాఖ అధికారుల సమన్వయంతో మరిన్ని సంక్షేమ పథకాలను గూడేల దరి చేర్చడంపై డీజీపీ సమీక్ష  నిర్వహించారు. మారుమూల ప్రాంతాల్లో గిరిజనుల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా ఈ పర్యటన ప్రథమ లక్ష్యం అన్నారు. పర్యావరణానికి హానికలకుండా రహదారుల నిర్మాణం చేపట్టాలి. రాష్ట్ర ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆఫీసర్ సువర్ణ. డీజీపీ శివధర్ రెడ్డితో పాటు రాష్ట్ర ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ సువర్ణ కూడా పాల్గొన్నారు. అటవీ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం వల్ల పర్యావరణానికి కలిగే మార్పులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వీరు పలు సూచనలు చేశారు. పాముసూరు నుండి కొండల ప్రాంతం వరకు సుమారు 15 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణాన్ని కేంద్ర బలగాలు విజయవంతంగా పూర్తి చేశాయని అభినందించారు. ఈ రహదారి అభివృద్ధి పనుల నాణ్యతను అధికారుల బృందం సమీక్షిస్తుందని తెలిపారు. పోలీసుల పహారాలో పాముసూరు గుట్టలు. డీజీపీ పర్యటనను పురస్కరించుకుని ములుగు జిల్లా పోలీస్ యంత్రాంగం భారీ బందోబస్తు నిర్వహిస్తోంది. ముర్మూరు బేస్ క్యాంప్ పరిసరాలను కేంద్ర బలగాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. పర్యటన సాగే మార్గమంతా డ్రోన్ల సహాయంతో నిఘా ఏర్పాటు చేశారు. స్థానిక పోలీసు అధికారులు ఏర్పాట్లను  పర్యవేక్షించారు. అత్యున్నత స్థాయి అధికారుల రాకతో కరెగుట్టల ప్రాంతంలో సందడినెలకొంది. ఈ రహదారి నిర్మాణంతో అటవీ ప్రాంతాల్లో శాంతి స్థాపనతో పాటు అభివృద్ధి వేగవంతం అవుతుందని ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాలు జిల్లా ఎస్ పి కేకన్ సుధీర్ రామనాధ్ గారి ఆధ్వరియంలో జరుగగా ముఖ్య అతిథులుగా పీసీసీఫ్ సువర్ణ,  ఏ డి జి అనిల్ కుమార్, ఎస్ఐబి ఐ జి సుమతి, సిఆర్పిఎఫ్ ఐజి విక్రమ్, ఏ ఎస్ పి ఏటూరునాగారం మనన్ భట్ పాల్గొన్నారు.







## అస్తవ్యస్తంగా గ్రామాభివృద్ధి

# నిధుల వినియోగం...?

**పిల్లల ఆటస్థలాలపై రోడ్లు ఇది అభివృద్ధేనా...!**

**క్రీడా ప్రాంగణం అని వ్రాసి ఉన్న పట్టించుకోని కాంట్రాక్టర్**

**ప్రజలకు ఉపయోగం లేని పనులతో ప్రజాధనం దుర్వినియోగం...!**

**సర్వాయిపేట గ్రామపంచాయతిలో ఉపాధి హామీ నిధులపై తీవ్రమైన ఆరోపణలు...!**

**పలిమెల, ప్రభాత వార్త :** గ్రామాభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంటే, ఆ నిధులు నిజంగా ప్రజలకు ఉపయోగప్డుతున్నాయా? లేక అధికారుల నిర్లక్ష్యం, గుత్తేదారుల ఇష్టారాజ్యం వల్ల అడ్డదారుల్లోకి వెళ్లిపోతున్నాయా..? అనే ప్రశ్నలు సర్వాయిపేట గ్రామపంచాయతిలో తీవ్రంగా వినిపిస్తున్నాయి.  సర్వాయిపేట గ్రామపంచాయతిలో ఉపాధి హామీ పథకం ఉపాధి హామీ ద్వారా ప్రధాన రోడ్డు నుండి ప్రాథమిక పాఠశాల ముందు భాగం గుండా వేరొక సీసీ రోడ్డు వరకు రూ.10 లక్షలు మంజూరు చేయబడినవి. గ్రామ పంచాయతిలో తీసుకున్న తీర్మానం ప్రకారం, అంగన్వాడీ కేంద్రం వద్ద కొంత మేర, స్కూల్ గేటు నుండి స్కూల్ భవనం వరకు కొంత మేర మొత్తం రూ.10 లక్షలతో రోడ్డు వేయాలని నిర్ణయించారు. కానీ ఆ తీర్మానాలను పూర్తిగా విస్మరించి,  ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు ఆడుకోవడానికి కూడా స్థలం లేకుండా ఇష్టారీతిగా రోడ్లు వేయడం జరిగిందన్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాఠశాల ప్రాంగణం పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి అత్యంత అవసరమైన ఆట స్థలం. అలాంటి చోట్ల రోడ్లు వేసి విద్యార్థుల హక్కులను కాలరాయడం ఎంతవరకు సమంజసం అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులు ప్రజలకు మేలు చేయాల్సినవి కాని, భవిష్యత్తు తరాలపై ప్రతికూల ప్రభావం చూపేలా ఉండటం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ ద్వారా మంజూరైన ప్రదేశంలో కాకుండా వేరే ప్రదేశంలో రోడ్డు నిర్మించాలంటే తప్పనిసరిగా మళ్లీ కలెక్టర్ అనుమతి తీసుకోవాలి.  కానీ ఈ నిబంధనలను పక్కన పెట్టి, సంబంధిత పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు గానీ, గుత్తేదారు గానీ ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా పనులు చేపట్టారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు కూడా పాటించకపోవడం మరో తీవ్ర అంశంగా మారింది. నాసిరకమైన మెటీరియల్ ఉపయోగించి, పనులు పూర్తిచేసినట్టు చూపిస్తూ ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితి తెలిసినా, సంబంధిత పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజల్లో చర్చ జరుగుతోంది. ప్రజాధనం ప్రజల కోసమే అనే మౌలిక సూత్రాన్ని మరిచి, అధికారుల నిర్లక్ష్యం వల్ల గ్రామాభివృద్ధి అర్థహీనంగా మారకూడదని సర్వాయిపేట గ్రామస్తులు కోరుకుంటున్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదల వరం...

**సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్**

**బయ్యారం, ప్రభాత వార్త :** బయ్యారం మండలం సింగారం గ్రామపంచాయతీలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాలతో సింగారం సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్ చెక్కులు పంపిణీ చేశారు. చెక్కులు అందుకున్న వారు చాట్ల స్వరూపరాణి 24,500, నునవత్ ఛాన్మిత 18,500 చుంచు విజయలక్ష్మి 15,500 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చుంచు మమతా, సాయికుమార్, వార్డు సభ్యులు చుంచు అనిల్ కుమార్, చెరుకుపల్లి మనిషా, గుగులోత్ అనూష, గుగులోత్ భద్రు నాయక్, సపవత్ అనిత, గ్రామ నాయకులు చాట్ల వెంకన్న, చెరుకుపల్లి రవి, మాజీ ఎంపిటిసి కొత్తపల్లి సీతారాములు, గుగులోత్ మహేష్, గుగులోత్ స్వరూప రాణి, బానోత్ బిక్కు, బాల్య, వీరన్న, గుగులోత్ సీతారాములు, సపవత్ మంగ్య, యువకులు గుగులోత్ హరీష్, సపవత్ సంతోష్, సపవత్ వంశీ, సపవత్ సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్

# జెచొక్కారావు దేవాదుల కెనాల్ ను వెంటనే పూర్తి చేయాలి

నర్సంపేట, ఏప్రిల్ 7, ప్రభాతవార్త



జె చొక్కా రావు దేవాదుల ఎత్తిపోతల పథకం ప్యాకేజ్ 5 ఎల్ఎంసి డిసి3 కెనాల్ను వెంటనే పూర్తి చేయాలని తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఈర్లపైడి అన్నారు. తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో నర్సంపేట ఆర్డిఓకి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జె చొక్కా రావు దేవాదుల ఎత్తిపోతల పథకం ప్యాకేజ్ 5 ఎల్ఎంసి డిసి3 కెనాల్ను నల్లబెల్లి మండలం గొల్లపల్లె గ్రామం నుండి దబ్బిరిపేట, మేడపల్లి ,రామారావు తండా ,నర్సింగాపురం, ఇటుకలపల్లి ,ఆకుల తండా, ఎనగల్ తండా, ముత్తోజిపేట, రాజుపేట దామెర చెరువు వరకు కి.మీ 11.905 దూరం దాదాపు 5 వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. కానీ సంబంధిత కాంట్రాక్టర్ ఆరు సంవత్సరాల క్రితం నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేయడం జరిగిందన్నారు. ఈ కెనాల్ అసంపూర్తిగా ఉండడంతో సాగునీరు అందక ఈ సీజన్లో పంటలు ఎండిపోవడం జరిగిందన్నారు. ఈ కెనాల్ పరిధిలో భూమి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందకుంటే అట్టి రైతులకు నష్టపరిహారం వెంటనే చెల్లించి త్వరగా నిర్మాణ పనులు పూర్తి అయ్యేటట్టు చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే సీజన్ ను దృష్టిలో ఉంచుకొని ఈ వేసవికాలంలో పంటలు లేని సమయంలో కెనాల్ పూర్తి చేసి వచ్చే సీజన్కు సాగునీరు అందేటట్టు ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి సంబంధిత కాంట్రాక్టర్, ఇరిగేషన్ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి నిర్మాణ పనులు పూర్తి అయ్యేటట్టు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు భూమా అశోక్ ,ఎలకంటి కుమారస్వామి, సుక్క వీరన్న,నూకల మరి సదానందం, బోనగిరి సారన్న తదితరులు పాల్గొన్నారు.

## నేరాలు-దారుణాలు

### హెచ్‌పీవీ వ్యాక్సిన్ బాలికలకు వేయించాలి



దుగ్గొండి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త

క్యాన్సర్ వ్యాధి రాకుండా ముందస్తుగా 14 సంవత్సరాలు నిండిన బాలికలకు హ్యూమన్ పాపిలోమా వైరస్ను వేయించాలని ప్రాథమిక వైద్యాధికారి కిరణ్‌రాజ్ అన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాలు నిండిన బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయిస్తే క్యాన్సర్ వ్యాధి రాకుండా ఉంటుందన్నారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓ ఆర్ఎస్ ప్యాకెట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్లో ఉంటాయన్నారు. బయటికి వెళ్లే ముందు తలపాగ చుట్టుకొని వెళ్లాలన్నారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి అనునిత్యం సేవలందించాలన్నారు. కలుషితమైన నీరు త్రాగి అనారోగ్యాల భారిన పడవద్దన్నారు. కాచి వడపోసిన నీరు త్రాగాలన్నారు. గర్భిణీ స్త్రీల నమోదు గ్రామాల్లో చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు అయ్యేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భరత్‌కుమార్, పృథ్వీరాజ్, వనమాల, దుర్గారాణి, సిహెచ్‌వో సలోమి, హెచ్‌ఈవో సాంబయ్య, స్టాఫ్ నర్సు సబిత, జ్యోతి, ఫార్మసిస్టు విజయలక్ష్మి, ఎల్టీ స్వప్న, ఏఎన్ఎంలు కోమల, బుజ్జమ్మ, రజిత, సునిత, సరస్వతి, విజయలక్ష్మి, స్వరూప, ప్రభావతి, హెల్త్ అసిస్టెంట్ రహమాన్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు ఆరోగ్యాన్ని రక్షించుకోవాలి

**-చైర్ పర్సన్ లక్ష్మీరామానంద్**

నర్సంపేట, ఏప్రిల్ 7, ప్రభాతవార్త



ప్రతి ఒక్కరు ఆరోగ్యాన్ని రక్షించుకోవాలని చైర్ పర్సన్ పెండెం లక్ష్మీరామానంద్ మంగళవారం అన్నారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఏ.ఎస్.ఆర్ సేవా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఎర్రబోయిన రాజశేఖర్ ఆధ్వర్యం లో నర్సంపేట బాయ్స్ హైస్కూల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ ఛైర్పర్సన్ లక్ష్మీరామానంద్ , మున్సిపల్ కమిషనర్ భాస్కర్ లు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఛైర్పర్సన్ మాట్లాడుతూ తమ ఆరోగ్య రక్షణకొరకు ప్రతి ఒక్కరు వాకింగ్,యోగా చేస్తూ, గేమ్స్ ఆడుతూ,బలమైన ఆహారం తీసుకుంటూ తమ ఆరోగ్యాన్ని రక్షించుకోవాలన్నారు.స్కూల్ విద్యార్థులు జంక్ ఫుడ్ తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని,ముఖ్యంగా విద్యార్థులు వీటికి దూరంగా ఉండి ఆరోగ్యాన్ని రక్షించుకోవాలన్నారు.మున్సిపల్ కమిషనర్ భాస్కర్ మాట్లాడుతూ ప్రతి రోజు మనం తీసుకునే ఆహారం లోనే ఆరోగ్యం దాగి ఉన్నదని అన్నారు. ప్లాస్టిక్ కవర్లలో వేడివేడి ఆహారంతినకుండా,అనారోగ్య భారిన పడవద్దని అన్నారు. ప్రత్యామ్నాయముగా ఆరోగ్యాన్ని అందించే బయో కవర్లు వాడుతూ ఆరోగ్యాన్ని రక్షించుకోవాలన్నారు. అలాగే ప్రజా ఆరోగ్యాన్ని రక్షించడంలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధ అమలు పరచడానికి తగు చర్యలు చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమం లో కన్స్యూమర్ ఫోరం జిల్లా అధ్యక్షులు గిరిగాని సుదర్శన్ గౌడ్, కౌన్సిలర్ పొన్నాల మనిషా, ఇన్చార్జి హెడ్ మాస్టర్ రవికుమార్, బిక్షపతి,రాంబాబు, ఏఎస్ఆర్ సేవా స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి తంగెళ్ల రవికాంత్, సభ్యుడు రామసేవక్,విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

### గ్రామాల సమగ్ర అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం



నల్లబెల్లి, ఏప్రిల్ 07, ప్రభాతవార్త

ప్రతి గ్రామ సమగ్ర అభివృద్దే ప్రజా పాలనలోని కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. రేలకుంటలో సర్పంచ్ హేమలత శ్రీధర్ అధ్యక్షతన సిసి రోడ్డు పనులను మంగళవారం ప్రారంభించారు.ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు సమగ్ర అభివృద్ధి చెందుతున్నాయని గుర్తు చేశారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పన పక్కా రోడ్ల ఏర్పాటే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. సంక్షేమ పథకాలు అమలు కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రవెల్లి రఘుపతిరావు, మాలోతు చరణ్ సింగ్, కుసుంబ రఘుపతి, వైనాలా పవన్, అన్నర యాకయ్య, రేలకుంట వెంగల్రావ్ రమేష్‌ఎలబోయిన రఘు పతి, జునూరు సురేష్, నాయకులు బత్తిని మల్లయ్య, అరిగెల చంద్రచారి, వెంగల్ దాస్‌రాజు, శ్యాంసుందర్, ది కొండ బిక్షపతి, దంచనలసతీష్, పాల్గొన్నారు.

# రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుదాం

**- జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా**

ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :



రక్తదానంచేసి మానవత్వాన్ని చాటుదామని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పిలుపునిచ్చారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాల - జీజీహెచ్ ఆధ్వర్యంలో మెడికోస్ బ్లడ్ డోనర్స్ క్లబ్ సహకారంతో మంగళవారం జిల్లాకేంద్రంలోని చంపక్‌హిల్స్ పరిధిలోగల ప్రభుత్వ వైద్యకళాశాలలోని కాన్ఫరెన్స్ హాల్లో మెగారక్తదాన శిబిరం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా హాజరై, ఈ మెగారక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం అత్యంత మహత్తరమైన సేవఅని పేర్కొన్నారు. సమాజంలో అవసరమైన వారికి సమయానికి రక్తం అందించడం ద్వారా ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు.రక్తదానంచేయడం చాలాగొప్ప కార్యక్రమమని, యువత ముందుకు వచ్చి ఇలాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈరక్తదాన శిబిరంలో వైద్యవిద్యార్థులు, సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానంచేసి, మానవతా సేవకు తమ వంతు సహకారం అందించారు.వైద్యులు ఈ రక్తసేకరణ ప్రక్రియను పర్యవేక్షిస్తూ, దాతలకు అవసరమైన సూచనలు చేశారు.అదే విధంగా వైద్య కళాశాలలోని ల్యాబ్ ను సందర్శించి, పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ రాజలింగం, జీఎంసీ ప్రిన్సిపల్ డా. నాగమణి, ఆర్ఎంఓ డా.కోటాచలం, వైద్యులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

### వార్డు సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తా

నర్సంపేట, ఏప్రిల్ 7, ప్రభాతవార్త



17వ వార్డు సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని వార్డు కౌన్సిలర్ సలావుద్దీన్ అయూబ్‌ఖాన్ అన్నారు. మంగళవారం ఆయన ఎన్టీఆర్ నగర్‌లో మురుగునీరు ఆగి ఉన్నచోట చైర్మన్ పెండెం లక్ష్మీరామానంద్ సహకారంతో జేసీబీ తీసుకెళ్లి కలువలను తీయించారు. వార్డు పరిధిలో గల ఎన్టీఆర్‌నగర్‌లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. వార్డును అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళతానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడికందుల సంతోష్, వెంకటేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ

నర్మెట, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :

గుంటూరు పల్లి గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం మంగళవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ బిరెడ్డి చిన్నపరెడ్డి స్థలదాత మేకల వేలన్గిరెడ్డి ఇన్చార్జి ఎంపీడీవో వెంకటమల్లికార్జున్ పిఆర్ ఏఈ గురిజాల ప్రదీప్‌కుమార్ పంచాయతీ కార్యదర్శి చలపతి ఉపసర్పంచ్ విజయ్ వెల్లంద సర్పంచి కాంతి ఆంజనేయులు, టీఆర్ఎస్ ఉమ్మడి మండలపార్టీ కన్వీనర్ పెద్దిరాజురెడ్డి మండలశాఖ అధ్యక్షులు చింతకింది సురేష్ నాయకులు ఎండి.గౌసు, చేర్యాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




# బయ్యారంలో సి.సి. రోడ్డు పనులకు శ్రీకారం

**రూ. 5 లక్షలతో గ్రామ అభివృద్ధి పనులు ప్రారంభం**

**వర్షాకాలం ఇబ్బందులకు చెక్**

**పనులను ప్రారంభించిన సర్పంచ్ ఇనుగాల లింగయ్య**

కాటారం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త



గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందులో భాగంగానే జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం బయ్యారం గ్రామంలో మంగళవారం నూతన సి.సి. రోడ్డు నిర్మాణ పనులకు ఘనంగా శ్రీకారం చుట్టారు. సి.ఆర్.ఆర్ నిధుల నుంచి మంజూరైన రూ. 5 లక్షల వ్యయంతో ఈ అంతర్గత రహదారి నిర్మాణాన్ని చేపట్టారు. గ్రామ సర్పంచ్ ఇనుగాల లింగయ్య శాస్త్రోక్తంగా కొబ్బరికాయ కొట్టి, భూమి పూజ చేసి పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..గ్రామ అభివృద్ధిలో భాగంగా అత్యంత ప్రాధాన్యత ఉన్న ప్రాంతాల్లో సి.సి. రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే గ్రామస్తులకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారుతాయని, ముఖ్యంగా వర్షాకాలంలో రోడ్లు బురదమయమై పడే ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నాణ్యతతో, నిర్ణీత కాల వ్యవధిలో పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జాగిరి శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చినాల బ్రహ్మ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు జాగిరి రాజబాబు గౌడ్ తో పాటు వార్డు సభ్యులు సాగె మహేష్, గుంటి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అయిలి శ్రీనివాస్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## భక్తాంజనేయ స్వామి ఆలయ నూతన కమిటీ ఎన్నిక

**ఆలయ కమిటీ అధ్యక్షుడిగా చెన్నూరి అశోక్ నియామకం**

కాటారం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త



మండల పరిధిలోని చిదినేపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి సంబంధించి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన భక్తులు మరియు గ్రామస్తుల సమావేశంలో ఈ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా చెన్నూరి అశోక్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా గొడిసెల రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా జూకంటి మధు, ప్రధాన కార్యదర్శిగా చర్ల సంతు, కోశాధికారిగా భసవి రాజు, ప్రచార కార్యకర్తగా బోనాల రమేష్ బాధ్యతలు చేపట్టనున్నారు. కమిటీకి ముఖ్య సలహాదారులుగా జాడి శ్రీధర్ మరియు అంగడి వెంకటేశ్వర్లు వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు చెన్నూరి అశోక్ మాట్లాడుతూ.. స్వామివారి ఆలయ అభివృద్ధికి, భక్తులకు కల్పించే సౌకర్యాల విషయంలో కమిటీ సభ్యులందరితో కలిసి కృషి చేస్తానని తెలిపారు. ఆలయ పవిత్రతను కాపాడుతూ, రాబోయే ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు గ్రామస్తులు మరియు భక్తులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## మూగజీవాలకు ఆరోగ్య భరోసా

**దామరకుంటలో పశు వైద్య శాఖ టీకాల యజ్ఞం**

కాటారం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త



మండలంలోని దామరకుంట గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 65 గేదెలు, 42 ఆవులకు టీకాలు వేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోడిపెల్లి రాము రైతులను సమన్వయ పరిచి సహకరించగా, పశువైద్యాధికారులు డాక్టర్ రమేష్, డాక్టర్ ధీరజ్, పశు వైద్య సహాయకులు రాజశేఖర్, సుల్తానా బేగం, పశుమిత్ర నజీమా, గోపాలమిత్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పాము కాటుతో చిన్నారి మృతి

పలిమెల, ఏప్రిల్ 7, ప్రభాత వార్త



పలిమెల మండలం మోదేడు గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మడే వసంతమహేష్ దంపతుల ఏకైక కుమార్తె మడే రక్షన (మిల్కీ)(6) పాము కాటుకు గురై మృతి చెందింది. వివరాల ప్రకారం...మంగళవారం తెల్లవారు జామున చిన్నారి రక్షనకు పాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు వెంటనే అప్రమత్తమై ఆమెను భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎం.జి.ఎం ఆసుపత్రికి రిఫర్ చేశారు. అయితే వరంగల్ ఎం.జి.ఎం ఆసుపత్రికి చేరుకున్న అనంతరం వైద్యులు పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధమవుతుండగానే చిన్నారి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఏకైక సంతానాన్ని కోల్పోయిన తల్లిదండ్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. గ్రామంలో ఈ ఘటనతో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా

**ఉమ్మల బల్లయ్య దశదినకర్మకు బియ్యం వితరణ**

మహాముత్తారం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త



గ్రామానికి చెందిన ఉమ్మల రాజయ్య తండ్రి ఉమ్మల బల్లయ్య ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వారి కుటుంబ పరిస్థితిని గమనించి, రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు ఆదేశాల మేరకు ఆ కుటుంబానికి సామాజిక బాధ్యతగా ఆర్థిక సాయంతో పాటు 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పక్కల సడవలి, నర్సింగాపూర్ సర్పంచ్ ఎన్నం సునీత నరేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద కుటుంబాలను ఆదుకోవడంలో తాము ఎప్పుడూ ముందుంటామని, బల్లయ్య మృతి ఆ కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్కిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, వార్డు నంబర్ 1 సభ్యులు లావుడియా విజయ్ రాజు, పిట్టల రవి, మాత నితీష్ దేవేందర్, గ్రామ శాఖ అధ్యక్షులు ఎండి ఖయ్యూం, సంధి సుధాకర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు హనుమంత్, మహిళా అధ్యక్షురాలు కొరళ్ల సమ్మక్క, లక్కిరెడ్డి తిరుపతి రెడ్డి, రవీందర్, ఉమ్మల దుర్గయ్య, కొరళ్ల సంపత్ రెడ్డి, యూత్ ఉపాధ్యక్షులు గాదె శేఖర్ తదితరులు పాల్గొని రాజయ్య కుటుంబాన్ని పరామర్శించారు.

## జన గణన నియామకాల్లో బంధుప్రీతిని వీడాలి

**సీనియార్టీ ప్రాతిపదికనే సూపర్వైజర్ల ఎంపిక జరగాలి**

**జిల్లా యంత్రాంగానికి డిటిఎఫ్ డిమాండ్**

మహాముత్తారం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 2026 జనగణన సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్ల నియామకాల్లో అధికారులు సీనియారిటీకి లోపం, ఇష్టారాజ్యం చేస్తున్నారని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ అశోక్, ప్రధాన కార్యదర్శి ఏ తిరుపతి ఆక్షేపించారు. జూనియర్లను సూపర్వైజర్లు, సీనియర్లను ఎన్యుమరేటర్లుగా చేసి, ప్రశ్నించినోళ్లను బెదిరిస్తున్నారని విమర్శించారు. సీనియారిటీ, ఆరోగ్యం పరిగణించి పారదర్శకంగా నియామకాలు చేయాలని, లిస్టులు సమీక్షి ంచాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

**శాస్త్రీయ దృక్పథంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం**

కాటారం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త



ప్రజారోగ్యం పట్ల అవగాహన పెంచేందుకు ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటామని కాటారం ప్రభుత్వ వైద్యాధికారిణి డాక్టర్ మోనిక తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 2026 సంవత్సరానికి గానూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆరోగ్యానికి కలిసికట్టుగా.. శాస్త్రాన్ని ఆదరించండి అనే నినాదాన్ని నిర్ణయించిందని డాక్టర్ మోనిక పేర్కొన్నారు. మారుతున్న కాలంలో మానవాళి ఆరోగ్యానికి విజ్ఞాన శాస్త్రం, పరిశోధనలు ఎంత కీలకమో ఈ థీమ్ నొక్కి చెబుతుందని ఆమె వివరించారు. ప్రస్తుత ప్రపంచంలో కొత్త రకమైన వ్యాధులు, ఇన్ఫెక్షన్లు పుట్టుకొస్తున్నాయని, వాటిని ఎదుర్కోవాలంటే కేవలం శాస్త్రీయ పరిశోధనలు, ఆధారిత వైద్య సేవలు మాత్రమే మార్గమని ఆమె అన్నారు. వైద్యులు, శాస్త్రవేత్తలు మరియు ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసినప్పుడే సామాన్యులకు నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మోనిక ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తుచేశారు. ఆరోగ్యం అంటే కేవలం మనుషుల ఆరోగ్యం మాత్రమే కాదని, పర్యావరణం మరియు జంతువుల ఆరోగ్యం కూడా ఇందులో భాగమేనని చెప్పారు. ప్రకృతి సమతుల్యత దెబ్బతింటే అది నేరుగా మానవ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని, అందుకే పర్యావరణ పరిరక్షణపై కూడా ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని కోరారు. మనమందరం శాస్త్రీయ పద్ధతులను నమ్మి, మూఢనమ్మకాలను వీడాలన్నారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ, పరిశుభ్రత పాటిస్తూ కలిసికట్టుగా ముందుకు సాగితేనే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలం అని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, రోగులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కోర్టుకు హాజరు కాని ఇద్దరు వ్యక్తుల రిమాండ్..

మహాదేవపూర్, మార్చి 7, ప్రభాతవార్త

మహాదేవపూర్ మండల కేంద్రంలో 2002 లో జరిగిన ప్రభుత్వ ఉద్యోగి డ్యూటీలకు ఆటంకం కలిగించిన కేసులో కోర్టుకు హాజరు కాని ఇద్దరు వ్యక్తులను మాహదేవపూర్ పోలీసులు పట్టుకుని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. బొమ్మపూర్ గ్రామానికి చెందిన అంబాల రాజ్ కుమార్, కాటారం మండలం ఒడిపిలవంచకు చెందిన వేముల హరికృష్ణ పై నమోదైన కేసులో కోర్టు విచారణకు హాజరు కాకపోవడంతో మెజిస్ట్రేట్ వారి పై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం మహాదేవపూర్ ఎస్సై పవన్ కుమార్ వారిని పట్టుకుని భూపాలపల్లి మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. విచారణ అనంతరం మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఇద్దరినీ రిమాండ్ విధించి పరకాల సబ్ జైలుకు తరలించినట్లు మహాదేవపూర్ ఎస్సై కే . పవన్ కుమార్ తెలిపారు.

# ఇంకెన్నాళ్లు... ఇంకెన్నేళ్లూ...!

**- స్థానికంగా ఉండేది ఎవరూ..?!**
**- పట్టణాలకే పరిమితమైన అధికారులు - ప్రజాప్రతినిధులు..!**
**- పట్టించుకునే నాథుడే లేరా..?!**

**బచ్చన్నపేట, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :**

ఉద్యోగ రీత్యా విధులు నిర్వహించే ఉన్నతాధికారుల నుంచి చిన్నస్థాయి ఉద్యోగులు కూడా పనిచేసే చోట స్థానికంగా నివాసం ఉండాలనే నిబంధనలు ఉన్నా వాటిని తుంగలో తొక్కి పట్టణాల్లో నివాసం ఉంటూ చుట్టపుచూపుగా గ్రామాల్లో విధులకు వచ్చి వెళ్లుతుండడంతో స్థానికంగా ఉండే ప్రజలు అధికారులకోసం చూసి ఎదురుచూపులు ఓవైపు ఐతే మరోవైపు స్థానికంగా ఉండే ప్రజాప్రతినిధులు కూడా మీమేమీ తక్కువ కాదన్నట్లుగా ఎన్నుకున్న ప్రజలతో స్థానికంగా ఉంటూ వారి సమస్యలు, ఇబ్బందులు తొలగించాల్సిన ప్రజాప్రతినిధులు కూడా వారి స్వలాభాలకోసం ఓట్లకు ముందు ప్రజలతో ఓట్లు వేయించుకుని తీరా గెలిచిన అనంతరం పట్టణాల్లో తిష్టవేసి ఏదో చుట్టపు చూపుగా గ్రామాలకు వస్తూ ప్రజా సమస్యలను అరకొరగా విని చూస్తాంలే చేస్తాంలే అంటూ సమస్యలు దాటవేసే నాయకులతో మాకు ఈ ఇబ్బందులు ఇంకెన్నాళ్లు.. ఇంకెన్నేళ్లు... మా బాధ పట్టించుకునే వారే కరువయ్యారా అని ప్రజల ఆరోపణలతో ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు తాము పనిచేసే చోటే (స్థానికంగా) నివాసం ఉండాలని గతంలోనే పలు జీవోలు జారీ అయ్యాయి. ముఖ్యంగా గ్రామ, మండల స్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నది ప్రధానం.ప్రజల చేత, ప్రజల కోసం ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు ప్రజలకు దూరమవుతున్నారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ చట్టం2018 నిబంధనల ప్రకారం.. గ్రామ పంచాయితీ సర్పంచ్, వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామస్థాయి అధికారులు స్థానికంగా ఉండాలని చట్టం చెప్తుంటే, ఈ చట్టం ఏదోవారి సొంత చుట్టం అయినట్లు చుట్టపు చూపుగా వచ్చి పోతూ ఉన్నారు. నిరంతరం వారు ప్రజలకు అందుబాటులో ఉంటారని, నిర్ణీత సమయానికి కార్యాలయాలకు చేరుకుంటారని ప్రభుత్వం భావిస్తుంటే, చాలా వరకు ఎవరూ స్థానికంగా నివాసం ఉండటం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**- ప్రభుత్వ ఉన్నతాధికారులు.. ప్రజా ప్రతినిధులు పర్యటనలకే పరిమితం..:**

కొంతమంది అధికారులు జిల్లాకేంద్రమైన జనగామ... హైదరాబాద్‌లో నివాసం ఉంటు అక్కడి నుంచి తమ విధులకు హాజరవుతున్నారు. 15నుండి 30కిలో మీటర్లు ఉన్న మండలంలో నుంచికూడా రాకపోకలు సాగిస్తున్నారు. అంతేకాక సుమారుగా వారు రాకపోకలకే వంద కిలోమీటర్లు ప్రయాణం సాగిస్తూన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఉదయం 6గంటలకు కార్యాలయాలకు వెళ్లాల్సి ఉన్నా కొందరు 11, 12గంటల వరకు వెళ్లడంలేదన్న ఆరోపణలున్నాయి. మరికొందరు మధ్యాహ్నం భోజనం తర్వాత కార్యాలయాల్లో కనిపించడం లేదని, ముందువచ్చిన వారు మధ్యాహ్నం 11, 12గంటలకే వెళ్లిపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటనలు ఉంటే తప్ప మిగతా రోజుల్లో అధికారులు కార్యాలయాల్లో కనిపించడం కష్టంగా వినిపిస్తున్నాయి. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది తప్పనిసరిగా వారు పనిచేసే గ్రామంలో లేదా మండల కేంద్రంలోనే నివాసం ఉండాలని పంచాయతీ రాజ్ శాఖ పలుమార్లు ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగులు హెచ్ఆర్ఏ పొందుతున్నందున, వారు కేటాయించిన చోటే ఉండాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి.

**- స్థానికంగా ఉండని సర్పంచులు, వార్డు సభ్యులు..:**

మండలంలోని కొన్ని గ్రామాల సర్పంచ్లు, వార్డు సభ్యులు స్థానికంగా ఉండకపోవడంతో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నప్పటికి మండల అధికారులు మాత్రం చూసి చూడనట్లుగానే వ్యవహరిస్తూ తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ 2018 చట్టానికి నీరుగారుస్తున్నారు. సర్పంచ్ పట్టణంలో ఉంటూ ఎప్పుడు వస్తారో తెలియదంటున్నారు. సర్పంచ్ స్థానికంగా ఉండక పోవడంతో అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని, మండల అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు పలు గ్రామాల్లో వినిపిస్తున్నాయి. గ్రామంలో కనీస వసతులు కల్పించాల్సిన, ప్రజాప్రతినిధులు ఇటువైపే రావడం లేదనే విమర్శలు గ్రామాల్లో వెల్లువెత్తున్నాయి.

## గ్రామాల్లో ఐకేపీ-పీఏసీఎస్ ధాన్యం కొనుగోలుకేంద్రాల ఏర్పాటు




**బచ్చన్నపేట, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :**

తెలంగాణలో ధాన్యంకొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడానికి, రైతులకు ఇబ్బందులు కలగకుండా ఉండటానికి, అవసరమైన గ్రామాల్లో ఒకటి కంటే ఎక్కువ, అంటే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), ఐకేపీ (ఇందిరా క్రాంతిపథం) ఆధ్వర్యంలో రెండు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల రైతులు దళారులను నమ్మకుండా తమగ్రామ సమీపంలోని కేంద్రాల్లో తేమశాతాన్ని సరిచూసుకుని, మద్దతుధరతో ధాన్యాన్ని అమ్ముకునే అవకాశం కలుగుతుందని, ఒకేగ్రామంలో వేర్వేరు సంస్థల ద్వారా కేంద్రాలు ఉండవచ్చు అని, ఉదాహరణకు, ఒకటి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో, మరొకటి ఐకేపీ ఆధ్వర్యంలో నడిచే అవకాశం ఉంటుంది. సన్నరకం, దొడ్డురకం ధాన్యానికి వేర్వేరు కేంద్రాలు లేదా ఒకేచోట ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. కేంద్రాలవద్ద తేమను కొలిచే యంత్రాలు, టార్పాలిన్లు, మిల్లులకు ధాన్యం రవాణా చేసే వాహనాలను అందుబాటులో ఉంచుతున్నారు. పెద్ద గ్రామాల్లో లేదా ఎక్కువసాగు ఉన్న ప్రాంతాల్లో ఒకేకేంద్రం వల్ల కలిగే రద్దీని తగ్గించి, రైతులకు త్వరగా ధాన్యం విక్రయించుకునే వీలు కల్పిస్తున్నారు.

## ఉపసర్పంచ్ లక్ష్మారెడ్డి మృతిపట్ల ఎమ్మెల్యే నివాళులు



**రఘునాథపల్లి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :**

రఘునాథపల్లి మండలంలోని నిండిగొండ గ్రామ ఉపసర్పంచ్ గంగిడి లక్ష్మారెడ్డి ఆకస్మిక మృతిపట్ల విషయం తెలుసుకున్న నియోజకవర్గ ఎమ్మెల్యే కడియం శ్రీహరి లక్ష్మారెడ్డి భౌతికయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ లక్ష్మారెడ్డి ఆకస్మిక మృతి బాధాకరమని, మండల కాంగ్రెస్‌పార్టీకి, వారి కుటుంబానికి తీరనిలోటు అని ఆవేదన వ్యక్తంచేశారు. ఎమ్మెల్యేతోపాటు స్థానిక సర్పంచ్ వీరస్వామి, కాంగ్రెస్ పార్టీ జిల్లాఉపాధ్యక్షులు జగదీష్‌రెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు కోళ్లరవి, గొట్టం భాస్కర్‌రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ గంగిడి నరసింహారెడ్డి, ఈర్యానాయక్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం



**రఘునాథపల్లి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :**

ప్రభుత్వం గ్రామాలలోని అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలకు, బాలింతలకు, చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని మండెలగూడెం గ్రామసర్పంచ్ ద్యాగల రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలగూడెంలోని అంగన్వాడి 1వ 2వ సెంటర్లలో గాదె శ్రీలత, గాదె అండాలు ఆధ్వర్యంలో ఆరోగ్యలక్ష్మీ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి కమిటీ చైర్పర్సన్ సర్పంచ్ ద్యాగల రాజశేఖర్ హాజరై మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుండి ఆరు సంవత్సరాల తల్లులు గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారం గురించి తెలియచేశారు. గర్భిణీలు సరైన పౌష్టిక ఆహారం తినడం వలన ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మను ఇస్తారని తల్లులకు వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, వార్డుసభ్యులు ఏదునూరి వనజ, పెసర్ ప్రేమలత, గర్భిణీలు, బాలింతలు ఆరునెలల నుండి మూడు సంవత్సరాల తల్లులు హాజరయ్యారు.

## కేయూ ఓఎస్‌డీగా ఆచార్య వెంకట్రామరెడ్డి

**ఎడ్యుకేషన్ కేయూ, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :**



కాకతీయ విశ్వవిద్యాలయ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓ.ఎస్.డి)గా భౌతికశాస్త్ర విభాగ ఆచార్యులు ఆచార్య బి.వెంకట్రామరెడ్డిని ఒక సంవత్సర కాలానికి నియమిస్తూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా ఆచార్య బి.వెంకట్రామరెడ్డి ని పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు అభినందించారు. ఆచార్య వెంకట్రామరెడ్డి ప్రస్తుతం టీజీ ఎడ్‌సెట్ కన్వీనర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఆచార్య వెంకటరామరెడ్డి కి పలువురు అధ్యాపకులు బోధనేతర సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

## టీజీ సిపిజెట్ - 2026కన్వీనర్‌గా ఆచార్య కట్ల రాజేందర్

**ఎడ్యుకేషన్ కేయూ, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :**



2026 - 27విద్యా సంవత్సరానికి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పి.జి.లో ప్రవేశాలు పొందటానికి నిర్వహించు సీపీగెట్-2026 కన్వీనర్‌గా కామర్స్ అండ్ బిజినెస్ మానేజ్మెంట్ విభాగ ఆచార్యులు ఆచార్య రాజేందర్ కట్లను నియమిస్తూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం ఉత్తర్వులు జారిచేశారు. ప్రస్తుతం ఆచార్య రాజేందర్ విశ్వవిద్యాలయ పరిక్షల నియంత్రణ అధికారిగా, కామర్స్ విభాగ డీన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈసందర్భంగా పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

## కేయూలో ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ వార్షిక సమావేశం

**ఎడ్యుకేషన్ కేయూ, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :**

డిసెంబర్ నెలలో నిర్వహించనున్న ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ 209వ వార్షిక సమావేశం' ను డిసెంబర్ 27, 28, 29 తేదీలలో యూనివర్సిటీలో నిర్వహించే అవకాశాలు, వసతులు ఇతర ఏర్పాట్లను పరిశీలించడానికి ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ ప్రతినిధి బృందం యూనివర్సిటీని సందర్శించింది. చీఫ్ కన్వీనర్ డాక్టర్ అనిల్‌కుమార్ ఠాకూర్, జాయింట్ సెక్రటరీ డాక్టర్ నారాయణన్, సౌత్ కోఆర్డినేటర్ దిలీప్ కుమార్ వైస్‌చాన్స్‌లర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని, యూనివర్సిటీ వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎకనామిక్స్ విభాగ ఆచార్యులు డీన్, సోషల్ సైన్సెస్ ఆచార్య బి. సురేష్ లాల్ పాల్గొన్నారు.

## ఫిర్యాదు దారు చెంతకే పోలీసుల సేవలు

**నర్మెట, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :**



వరంగల్ సిపి సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు ఫిర్యాదు దారు చెంతకేవెళ్లి పోలీసు సేవలను ప్రారంభిస్తున్నట్లు సిఐ ముస్కు అబ్బయ్య మంగళవారం తెలిపారు. మండలంలోని మల్కపేట గ్రామానికి చెందిన భూక్య శారదా నాలుగేళ్ల క్రితం భర్తను కోల్పోయి ఇద్దరు పిల్లలు అత్తామామలతో కలిసి జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో గత కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన ఇద్దరు తన వెంట పడుతున్నారని సమాచారం అందించగా హెడ్ కానిస్టేబుల్ మల్లారెడ్డి పిసి దివ్యతో కలిసి బాధితురాలి ఇంటికి వెళ్లి కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా చర్యలు తప్పవని ఆయన ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

# ప్రజల ఆరోగ్యమే ప్రథమ కర్తవ్యం

### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

### శాస్త్ర విజ్ఞానంతో మెరుగైన వైద్య సేవలు.

**ములుగు జిల్లా బ్యూరో ప్రభాత వార్త,** ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, శాస్త్ర విజ్ఞానాన్ని ఆధారంగా తీసుకొని మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆరోగ్య అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి డి.ఎల్.ఆర్. ఫంక్షన్ హాల్ వరకు జరిగిన ఈ ర్యాలీలో ఆరోగ్యంపై అవగాహన కల్పించే ప్లకార్డులు, నినాదాలతో ప్రజలను చైతన్యపరిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యం కోసం కలిసి – శాస్త్రానికి మద్దతుగా నిలబడండి అనే 2026 ప్రపంచ ఆరోగ్య దినోత్సవ థీమ్‌తో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శాస్త్ర విజ్ఞానంతో ముందుకు సాగితేనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, నియమిత వ్యాయామం, పోషకాహారం, మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ అవసరమని సూచించారు. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం, దురవలాట్లకు దూరంగా ఉండడం వంటి ఆరోగ్య సూత్రాలను పాటించాలని ప్రజలను కోరారు. మూఢనమ్మకాలు, అపోహలను విడిచిపెట్టి శాస్త్రీయ దృక్పథంతో జీవించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో ప్రభుత్వ వైద్య సంస్థల్లో ప్రావీణ్యు లైన వైద్యులు సేవలందిస్తున్నారని, వారి సూచనలు పాటిస్తే




ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉండగలరని తెలిపారు. ఆరోగ్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, మహిళా సంఘాలు తమ బాధ్యతగా గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ర్యాలీలో పోషకాహారం ప్రాముఖ్యత, దురవలాట్ల వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై నినాదాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. తదనంతరం జిల్లా సాంస్కృతిక కళాజాత బృందం ఆరోగ్య సూత్రాలపై పాటలతో ప్రజలను చైతన్యపరిచింది. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, మెడికల్ కాలేజ్ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు రక్షణ కవచం

### కాటారం డీఎస్ పీ సూర్యనారాయణ

### బొమ్మాపూర్ లో 10 కమ్యూనిటీ సీసీ కెమెరాలు ప్రారంభం...

### గంజాయి, సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి...

### రోడ్డు భద్రతపై అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమం...



**మహాదేవపూర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం సబ్ డివిజన్ మహాదేవపూర్ సర్కిల్ పరిధిలోని బొమ్మాపూర్ గ్రామంలో పోలీస్ వారి సూచన మేరకు గ్రామస్థులు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకున్న 10 కమ్యూనిటీ సీసీ కెమెరాలను కాటారం డీఎస్ పీ సూర్య నారాయణ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్ పీ మాట్లాడుతూ.. గ్రామంలో శాంతిభద్రతల పరి రక్షణకు, నేరాల అదుపునకు సీసీ కెమెరాలు మూడో కన్నులా పనిచేస్తాయని కొనియాడారు. సాంకేతికతను అందిపుచ్చుకుని నేర రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడంలో ప్రజల భాగస్వామ్యం అభినందనీయమన్నారు. ప్రస్తుత సమాజంలో యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఆయన హితవు పలికారు. అలాగే పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు పంచుకోవద్దని సూచించారు. రోడ్డు భద్రతపై అవగాహ నపై అధికారుల ఆదేశాల మేరకు ఇదే వేదికపై రోడ్డు సేఫ్టీ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను దగ్గర ఉంచుకోవాలని సూచించారు. అతివేగం ప్రమాదకరమని, రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ప్రమాదాల బారిన పడి కుటుంబాలను రోడ్డున పడేయవద్దని యువతకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహాదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై పవన్ కుమార్, పోలీస్ సిబ్బందితో పాటు బొమ్మాపూర్ గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజలు తమ ఆరోగ్య పరిస్థితి పట్ల అప్రమత్తంగా ఉండాలి

### సకాలంలో సరైన వైద్య సేవలు పొందాలి

### వైద్యాధికారిని డాక్టర్ అల్లూరి అనూష



**గణపురం, ఏప్రిల్ 07, ప్రభాతవార్త** ప్రజలు తమ ఆరోగ్య పరిస్థితి పట్ల అప్రమత్తంగా ఉండాలని సకాలంలో సరైన వైద్య సేవలు పొందాలని గణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ అల్లూరి అనూష అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్ అనూష ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ ఆరోగ్య పరిస్థితిని నిరంతరం తెలుసుకోవాలని సూచించారు. రోజూ వ్యాయామం యోగా సాధన పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తుందని, ఈ సంవత్సరం ఆరోగ్యానికి కలిసి విజ్ఞానానికి మద్దతుగా నిలుద్దాం" అనే అంశంతో ఆరోగ్య సేవల్లో విజ్ఞానశాస్త్ర ప్రాముఖ్యతను తెలియజేస్తున్నారని పేర్కొన్నారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా వాటిని నివారించుకునే అవకాశం ఉంటుందని, అందరూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిహారిక డాక్టర్ సుచరిత సూపర్వైజర్ రాజేశ్వరి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో నిందితునికి జైలు శిక్ష, జరిమాన...

### గణపురం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త

గణపురం మండలం చెల్పూరు గ్రామంలో జరిగిన హత్యాయత్నం కేసులో నిందితునికి భూపాలపల్లి అసిస్టెంట్ సెషన్స్ న్యాయమూర్తి నాగరాజు 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,500/ జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. చెల్పూరు గ్రామానికి చెందిన బమ్మ బిక్షపతి (50 సంవత్సరాలు), బజ్జీల దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. తేదీ 07.01.2022న అదే గ్రామానికి చెందిన తాళ్ల పెల్లి రాజు మద్యం సేవించి అక్కడికి వచ్చి బిక్షపతిని చాప ముక్కలు ఇవ్వమని అడిగాడు. డబ్బులు ఇవ్వాలని చెప్పడంతో ఆగ్రహించిన నిందితుడు దుర్భాషలాడుతూ, చంపాలనే ఉద్దేశంతో మూకుడులో మసులుతున్న వేడి నూనెను ఫిర్యాదిదారిపై పోశాడు. దీంతో ఫిర్యాదిదారికి కాళ్లపై గాయాలు కాగా, ప్రాణభయంతో అక్కడి నుంచి పారిపోయాడు. అదే రోజు గణపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేయగా, అప్పటి ఎస్‌హెచ్‌ఓ ఉదయ్ కిరణ్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచి ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. కోర్టు విచారణలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.డి. రఫీక్ వాదనలు వినిపించగా, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ జి. వెంకన్న ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ శ్వేత సాక్షులను ప్రవేశపెట్టారు. విచారణలో నిందితునిపై నేరం రుజువైనందున న్యాయమూర్తి శిక్ష విధించారు. ఈ కేసులో నిందితునికి శిక్ష పడేలా కృషి చేసిన అధికారులను భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అభినందించారు.

# ములుగు వార్త

## ఈవీఎం గోదాం నెలవారి తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

### ములుగు జిల్లా బ్యూరో ప్రభాతవార్త



ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంను నెలవారి తనిఖీ చేశారు. గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ తనిఖీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గోదాం సీల్‌ను పరిశీలించడంతో పాటు, సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. అగ్నిప్రమాదాలు నివారించేందుకు ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు మరియు ఇతర అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలు జారీ చేశారు. అదేవిధంగా, గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తు, నిర్వహణ రిజిస్టర్లను కూడా కలెక్టర్ తనిఖీ చేశారు. భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం సహించబోమని సెక్యూరిటీ సిబ్బందిని హెచ్చరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ఈవీఎంల భద్రత విషయంలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనే తనిఖీలు నిర్వహించడం ద్వారా విశ్వసనీయతను పెంపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎండి సలీం, డిప్యూటీ తహసీల్దార్ నితీష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ మనోహర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సరిహద్దుల్లో భారీగా గుడుంబా పట్టివేత

### ఇద్దరిపై కేసు నమోదు...



**మహాదేవపూర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త** మహాదేవపూర్ మండల పరిధిలో అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గుడుంబాను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఎస్ఐ తన సిబ్బందితో కలిసి మేడిగడ్డ బ్యారేజీ సమీపంలోని ఎల్ అండ్ టీ రోడ్డు, అంబటిపల్లి వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఈ ఘటన వెలుగుచూసిందని తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా, అంకిత పోస్ట్ పరిధిలోని నడికూడ గ్రామానికి చెందిన సప్పిడి అశోక్, మాడెం పర్వతాలు అనే ఇద్దరు వ్యక్తులు హీరో హోండా ప్యాషన్ ప్రో బైక్‌పై మహారాష్ట్ర వైపు నుండి అనుమానాస్పదంగా వస్తూ కనిపించారు. వారి వద్ద ఉన్న ప్లాస్టిక్ కవర్‌పై అనుమానం వచ్చిన ఎస్ఐ, వాహనాన్ని ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సుమారు 20 లీటర్ల నిషేధిత గుడుంబా లభ్యమైంది. దీంతో పోలీసులు వెంటనే గుడుంబాను, రవాణాకు ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరిని అదుపులోకి తీసుకుని మహదేవపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై తదుపరి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు. అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

# వెజిటేబుల్ మినీ కిట్ల పంపిణీ

## రైతులకు అదనపు ఆదాయం

## హెచ్. ఈ.ఓ.జీవన్ రెడ్డి



**గోవిందరావుపేట ప్రభాతవార్త.** చల్వాయి గ్రామం రైతు వేదికలో రైతులకు వెజిటబుల్ మినీ కిట్ల పంపిణీ కూరగాయ విత్తనాలతో కూర గాయలు పండించడం వల్ల రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని జిల్లా హెచ్ఈఓ జీవన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చల్వాయి రైతు వేదిక లో స్థానిక వ్యవసాయ అధికారి జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు వెజిటబుల్ మినీకిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులను ఉద్దేశించి జీవన్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు కూరగాయల మినీ కిట్ల (వెజిటబుల్ మినీ కిట్స్) పంపిణీ కార్యక్రమం తరచుగా జరుగుతుందన్నారు. ముఖ్యంగా, రైతులకు అధిక ఆదాయం అందించే పంట మార్పిడి విధానాలను ప్రోత్సహించడానికి, ఉచితంగా కూరగాయల విత్తనాలు మరియు మిశ్రమ విత్తనాల కిట్లను ఉద్యాన మిషన్ ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానానికి మండలం లోని చల్వాయి గ్రామం రైతు వేదిక నుండి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు అనంతరం స్థానిక మండల వ్యవసాయ అధికారి జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉచిత కూరగాయల మినీ కిట్ల పంపిణీ కార్యక్రమం జరుగుతుంది. పంట మార్పిడిని ప్రోత్సహించడానికి మరియు రైతుల ఆదాయాన్ని పెంచడానికి ఈ కిట్లను అందజేస్తారు, ఇందులో హైబ్రిడ్ కూరగాయల విత్తనాలు ఉంటాయి. ఈ కార్యక్రమం ద్వారా డ్రిప్ ఇరిగేషన్ వినియోగం, ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తారు. ఈ కిట్లలో వివిధ రకాల కూరగాయల విత్తనాలు ఉంటాయి, ఇవి రైతులకు స్వల్పకాలంలో మంచి ఆదాయాన్ని మరియు వారి ఇంటి అవసరాలకు అవసరమైన కూరగాయలను అందిస్తాయి ఈ అవకాశాన్ని ప్రతి రైతు వినియోగించుకోవాలని వారు కోరారు. కూరగాయల సాగును ప్రోత్సహించి రైతులకు అదనపు ఆదాయం కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వెజిటబుల్ మిని కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గ లరైతులకు రూ.500 విలువ గల ఐదు రకాల కూరగాయ లవిత్తనాలతో కూడిన కిట్లు ఉచితంగా అందించబడతాయని ఆయన చెప్పారు. ఒక్క మినీ కిట్లో టమోటా, మిర్చి, బెండ, గోరుచిక్కుడు, పాలకూర విత్తనాలు ఉండి, ఇవి సుమారు 20 గుంటల భూమికి సరిపడే విధంగా ఉంటాయని వివరించారు. తక్కువ పెట్టుబడితో, తక్కువ విస్తీర్ణంలోనే మంచి ఆదాయం పొందే అవకాశం రైతులకు ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 625 ఎకరాల్లో కూరగాయల సాగు లక్ష్యంగా 1250 మిని కిట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆసక్తి గల రైతులు తమ భూమి పట్టాదారు పాసుబుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, సమీప ఉద్యాన కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకుని విత్తనాలను పొందవచ్చని తెలిపారు. వివరాలకు ములుగు ఉద్యాన అధికారి (సెల్: పేరు వేముల జీవన్ రెడ్డి, హార్టికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ ములుగు జిల్లా ఫోన్ ఫోన్ నెంబర్ లు +919989987804 989987804 +919989987804 సంపదనుంచవలసిందిగా కోరారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు సాయికుమార్, దాదా సింగ్, గోపాల్ రెడ్డి, ఉట్ల పృథ్వీ రాజ్ రైతులు,మేడిపల్లి రమేష్ బిక్షం రెడ్డి సంతోష్ రమేష్ సంతోష్ బి అశోక్ అంకం రాజేశ్వరరావు గూడూరు శ్రీనివాసరావు పూలపాక రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల్లో ఆరోగ్య స్పృహను పెంపొందించాలి

ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి దిలీప్ కుమార్ నాయక్

న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం...




**గణపురం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త** గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఆరోగ్యం పట్ల స్పృహను పెంపొందించాలని, వైద్యం తో పాటుగా నైతిక మద్దతును వారికీ అందించాలని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. ఆర్. దిలీప్ కుమార్ నాయక్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చెల్పూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్షేత్ర స్థాయిల్లో పనిచేసే ఆశ వర్కర్లు, ఏ.ఎన్.ఎం లు, హెల్త్ అసిస్టెంట్ లు ఆరోగ్యం చెడిపోయిన వారికీ వైద్య సేవలను అందించ డంతో పాటుగా, వారికీ నైతిక మద్దతును ప్రకటించాలని సూచించారు. మానసిక ధైర్యంతో రోగి యొక్క జబ్బు సగం నయం అవుతుందని పేర్కొన్నారు. ప్రజల్లో ఆరోగ్యం పట్ల అవగాహనా పెంచినప్పుడు, ఎవరికీ వారు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ద వహించినప్పుడు ఆరోగ్య భారతం నిర్మితం అవుతుందని జడ్జి హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మధుసూదన్, గవర్నమెంట్ ప్లీడర్ బోట్ల సుధాకర్, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కూనూరు సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఆకుల రాములు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్స్ పుప్పాల శ్రీనివాస్, కంప అక్షయ, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, పి.హెచ్.సి వైద్యులు డాక్టర్ స్వాతి, న్యాయవాదులు మంగళంపల్లి రాజ్ కుమార్, దుప్పటి ప్రవీణ్, గ్రామ సర్పంచ్ రజిత తదితరులు పాల్గొన్నారు.

# నిఘా నేత్రాలను ప్రారంభించిన డిఎస్పీ సూర్యనారాయణ...

నిఘా నేత్రం కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో

భాగంగా గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు..



**భూపాలపల్లి టౌన్, ఏప్రిల్ 07, ప్రభాతవార్త:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్ ఆదేశాల మేరకు, నేర నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, ప్రజల భాగస్వామ్యంతో భద్రతను బలోపేతం చేయడం లక్ష్యంగా "నిఘా నేత్రం"తో పాటు కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను అమలు చేస్తున్నాము. ఈ క్రమంలో భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం బొమ్మపూర్ గ్రామంలో పోలీస్ ఆధ్వర్యంలో, గ్రామ ప్రజల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సీసీ కెమెరాల వ్యవస్థను కాటారం డీఎస్పీ సూర్యనారాయణ ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ప్రజలు–పోలీసుల మధ్య సమన్వయం పెరిగి, సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నివారణ మరియు విచారణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని తెలిపారు. గ్రామ ప్రజలు పోలీస్ శాఖకు అందించిన సహకారం అభినందనీయం. భద్రత అందరి బాధ్యతగా భావించి, ఇలాంటి కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొనాలని కోరారు..

# కోర్టుకు హాజరు కాని ఇద్దరు వ్యక్తుల రిమాండ్

మహాదేవపూర్, మార్చి 7, ప్రభాతవార్త

మహాదేవపూర్ మండల కేంద్రంలో 2002 లో జరిగిన ప్రభుత్వ ఉద్యోగి డ్యూటీలకు ఆటంకం కలిగించిన కేసులో కోర్టుకు హాజరు కాని ఇద్దరు వ్యక్తులను మాహదేవపూర్ పోలీసులు పట్టుకుని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. బొమ్మపూర్ గ్రామానికి చెందిన అంబాల రాజ్ కుమార్, కాటారం మండలం ఒడిపిలవంచకు చెందిన వేముల హరికృష్ణ పై నమోదైన కేసులో కోర్టు విచారణకు హాజరు కాకపోవడంతో మెజిస్ట్రేట్ వారి పై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం మహా దేవపూర్ ఎస్సై పవన్ కుమార్ వారిని పట్టుకుని భూపాలపల్లి మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. విచారణ అనంతరం మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఇద్దరినీ రిమాండ్ విధించి పరకాల సబ్ జైలుకు తరలించినట్లు మహదేవపూర్ ఎస్సై కే . పవన్ కుమార్ తెలిపారు.

# ఏటూరునాగారం వార్త

## రామప్ప దేవాలయంను దర్శించుకున్న మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్

వెంకటాపూర్, (రామప్ప) ప్రభాతవార్త



మండలంలోని పాలంపేట గ్రామంలోని యునెస్కో గుర్తింపు పొందిన, ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ప్రముఖ శైవ క్షేత్రం రామప్ప దేవాలయంను మంగళవారం మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఈ.వి. నరసింహ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామి వారి శేషవస్త్రాలను బహు కరించారు. ఆలయ చరిత్ర, శిల్పకళ ప్రాముఖ్యత గురించి చరిత్రకారుడు ఈమని శివనాగిరెడ్డి, టూరిజం గైడ్ గోరంటల విజయ్ కుమార్ వివరించారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించారు. వారి వెంట ప్రముఖ చరిత్రకారుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ ఈమని శివనాగిరెడ్డి, యువ చరిత్రకారుడు అరవింద్ ఆర్య, తహసీల్దార్ గిరిబాబు,, ఆర్ ఐ రమేష్, టూరిస్ట్ పోలీస్ శ్రీనివాస్ ఉన్నారు.

## క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి.

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు.

చిట్యాలలో సి.సి.పి.ఎల్ సీజన్ 4 క్రికెట్ పోటీల ప్రారంభం.



**చిట్యాల ఏప్రిల్ 7 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం క్రీడల నిర్వహణ కోసం ప్రత్యేక కృషి చేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలం కేంద్రంలోని పిఎసిఎస్ ఆవరణలో నిర్వహిస్తున్న సి.సి.పి.ఎల్ సీజన్-4 క్రికెట్ పోటీలను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్ తో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల వల్ల శరీర దారుఢ్యం తో పాటు మానసిక ఉల్లాసం అలవడుతుందని అన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి, జాతీయ స్థాయికి ఎదగాలని కోరారు. క్రీడలు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. గ్రామీణ స్థాయిలో ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడలతో ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వస్తారని పేర్కొన్నారు. అనంతరం కప్పు ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి గుమ్మడి శ్రీదేవి, మాజీ ఎంపీటీసీ కటుకూరి పద్మ నరేందర్, యూత్ మండల్ అధ్యక్షుడు అల్ల కొండ కుమార్, టౌన్ అధ్యక్షుడు గంగాధరి రవీందర్, జిల్లా కార్యదర్శి చిలుకల రాజ కొమురయ్య, మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమురయ్య, పిఎసిఎస్ మాజీ వైస్ చైర్మన్ బుర్ర శ్రీనివాస్ గౌడ్, నాయకులు అల్లం రాజు, సర్వ శరత్, నవాబుపేట సర్పంచ్ కసిరెడ్డి సాయి సుధా రత్నాకర్ రెడ్డి, క్రీడల అధ్యక్షుడు బండి రాజు, నాయకులు, కార్యకర్తలు క్రీడాకారులు, పెద్ద పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**ఏప్రిల్ 7, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్ :**

హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మంగళవారం హన్మకొండలోని ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలను ఆకస్మికంగా సందర్శించి, ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను సమగ్రంగా పరిశీలించారు. మొదటగా ఓపీ కౌంటర్ల వద్ద సేవల పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్, రిజిస్టర్ల నిర్వహణపై సమీక్ష చేశారు. అనంతరం ఫార్మసీని తనిఖీ చేసి, ఔషధాల నిల్వలు, పంపిణీ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా లేబర్ రూమ్, వార్డులు మరియు ఇతర విభాగాలను సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. కొన్ని వార్డుల్లో స్వల్పంగా శుభ్రత లోపం గమనించిన కలెక్టర్, వెంటనే శుభ్రత ప్రమాణాలను మెరుగుపరచాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. వైద్య సేవల



అమలు విధానంపై వివరాలు అడిగి తెలుసుకున్న కలెక్టర్, రోగులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారికి అందుతున్న సేవలపై అభిప్రాయాలను సేకరించారు. వైద్య సిబ్బంది విధులకు సమయానికి హాజరు కావడంతో పాటు, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో నిరక్ష ్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఆసుపత్రి క్యాంటీన్‌ను కూడా పరిశీలించిన కలెక్టర్, ఆహార పదార్థాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా వంట నూనెను పునర్వినియోగం చేయవద్దని హెచ్చరించారు. మొత్తం ఆసుపత్రి నిర్వహణను మరింత సమర్థవంతంగా, శుభ్రతతో నిర్వహిస్తూ, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కట్టుబడి పనిచేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి ్మ, ఆర్‌ఎంఓ డాక్టర్ మంజుల, డ్యూటీ డాక్టర్లు మరియు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## దళిత రైతు కుటుంబంపై బెదిరింపులు భూమి కబ్జా

**ఆత్మకూరు, ప్రభాతవార్త ఏప్రిల్ 7:**



హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం గుడేపాడు గ్రామంలో దళిత రైతు కుటుంబానికి చెందిన వ్యవసాయ భూమిపై కబ్జా ప్రయత్నాలు జరుగుతున్నాయని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ మరియు ధర్మ సమాజ్ పార్టీ నాయకులు ఆరోపించారు. గ్రామానికి చెందిన తేనేటి మహేందర్ రెడ్డి అల్లుడు కులం పేరుతో దూషిస్తూ బాధిత కుటుంబాన్ని బెదిరిస్తున్నాడని వారు పేర్కొన్నారు. కొత్తగట్టు శివారు సర్వే నెంబర్ 831లో పరికి పుష్ప భర్త స్వామి 1997లో కొనుగోలు చేసిన 1 ఎకరం 5 గుంటల వ్యవసాయ భూమిని అప్పటి నుండి పుష్ప కుటుంబం సాగు చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. అయితే పక్క భూమికి చెందిన తేనేటి మహేందర్ రెడ్డి అల్లుడు భూమి వివాదాన్ని కారణంగా చూపుతూ కులదూషణలకు పాల్పడుతూ, పుష్ప కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. ఇదే క్రమంలో పుష్పకు చెందిన సుమారు 30 గుంటల భూమిని కబ్జా చేసి, వారి భూమిలోకి రానీయకుండా అడ్డంకులు సృష్టిస్తూ అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నాడని తెలిపారు. ఇది దళితులపై వివక్ష చూపించే చర్యగా జేఏసీ నాయకులు విమర్శించారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండించిన నాయకులు, ఎమ్మార్వో మరియు ఆర్డీవో అధికారులు తక్షణమే స్పందించి భూమిని తిరిగి అప్పగించి బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ చంద మల్లయ్య, కోఆర్డినేటర్ మేకల సుమన్, జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకులు మైదం రవి, బొచ్చు కృష్ణ, ఎస్కే సలీం పాషా, ధర్మ, అన్నమయ్య, సైలని బాబా తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్ల తొలగింపు

**ఏప్రిల్ 07(ప్రభాతవార్త)కాజీపేట్**

మండల్‌మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న హన్మకొండ హైదరాబాద్ మెయిన్ హై వే మీద చెట్లు చాలా పెద్దవిగా ఉండి మూల మలుపుల వద్ద యూ టర్న్ చేసే చోట రోడ్డు కనపడకపోవడం రహదారిలో చెట్లు దట్టంగా పెరిగిపోయి ప్రజలు రాకపోకలు, సాగించేందుకు అడ్డంకిగా మారాయి. రోడ్డుపైకి చెట్ల కొమ్మలు వ్యాపించడంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తరచూ పలుసార్లు ప్రమాదాలు జరుగుతూ వాహన దారులు ఎదురెదురుగా వస్తూ ఢీ కొని చాలా మంది గాయాలు తగిలి ఆసుపత్రి లో చికిత్స చేయించు కున్న సంఘటనలు జరిగాయి. చాలా ఆక్సిడెంట్ జరుగుతున్నాయి. దీనిని గుర్తించిన మడికొండ పోలీస్ ఇన్స్పెక్టర్, పుల్యాల.కిషన్ తన సిబ్బందితో కలిసి మెయిన్ రోడ్డు మీద రొట్టె బండ వద్ద, మడికొండ ఇండస్ట్రియల్ ఏరియా, అయోధ్యపురం ఎక్స్ రోడ్ వద్ద రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్లను మల్టీ ఫర్పస్ వర్కర్లు చే కొట్టించి తొలగించారు. దీంతో రహదారి ఎప్పటిలాగా విశాలంగా మారడంతో పాటు దారి కనబడకుండా అడ్డంకిగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించడంతో రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వాహనదారులు, పాదాచారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు



# కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలి

### డిసిసి అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి

**హసన్ పర్తి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**

కాంగ్రెస్ పార్టీని గడపగడపకు తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేసిన కార్యకర్తలకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇనుగాల వెంకటరామిరెడ్డి అన్నాడు. మంగళవారం 55వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటరామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పార్టీలో జరుగుతున్న అంశాలపై, సీనియర్ కార్యకర్తలకు జరుగుతున్న అన్యాయాలపై ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా



వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సీనియర్ కార్యకర్తలకు రానున్న రోజుల్లో సముచిత స్థానాన్ని కల్పించి గౌరవించడం జరుగుతుందని తెలిపాడు. 55 వ డివిజన్ లో చాలా మంది కరుడు కప్పిన కాంగ్రెస్ వాదులు ఉన్న సంగతి తనకు తెలుసని గుర్తు చేశాడు. వెంకటరామిరెడ్డి ని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంఘాల చిట్టిబాబు, మాజీ సర్పంచ్ బూర సారంగపాణి గౌడ్ ,ఎర్ర గట్టుగుట్ట చైర్మన్ మార్క రాజు, ఎర్రగట్టుగుట్ట మాజీ చైర్మన్ ముచ్చు వెంకటస్వామి, రణధీర్, డాక్టర్ సంఘాల ఎఫ్‌ఎం రాజా, బొక్క కిరాణా రాజ్ ,కొలిపాక శరత్ , బూర నరేష్ యువజన నాయకులు సంఘాల రవి, అల్లం సన్నీ తదితరులు ఉన్నారు.




## ధర్మసాగర్‌లో బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు

**ధర్మసాగర్, ఏప్రిల్ 7 (ప్రభాతవార్త):**




ధర్మసాగర్ మండలంలో బాలల హక్కుల పరిరక్షణ కోసం 17 మంది సభ్యులతో మండల బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేసినట్లు ఎంపిడివో అనిల్ కుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమం ఐసీడీఎస్ సూపర్వైజర్ ముశ్రత్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో అనిల్ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలలపై హింస, వివక్ష నివారణ, గర్భస్థ లింగ నిర్ధారణ నిరోధం, అక్రమ దత్తతల నియంత్రణ వంటి అంశాలపై కమిటీ పనిచేస్తుందని తెలిపారు. కమిటీలో మండల స్పెషల్ ఆఫీసర్ (చైర్మన్)ఎంపిడివో అనిల్ కుమార్ (కార్యదర్శి)సిడిపివో ఎం. విశ్వజ (కన్వీనర్) సభ్యులుగా మండల విద్యాధికారి రాంధన్ ఎస్ఐ జానీ పాషా డా. అరుణ ఎస్.భాస్కర్ హరీష్ మాచర్ల జ్యోతి తోట నాగరాజు చామంతి చాణక్య మెరుగు శ్రీనివాసులు నక్క శ్రీరామ్ గడ్డం రఘురామ్మనకం హర్షిత తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డిసిపివో ఎస్.ప్రవీణ్ కుమార్ చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ ఎస్. భాస్కర్, సూపర్వైజర్లు ముశ్రత్ స్వరూప కవిత సోషల్ వర్కర్ మెరుగు శ్రీనివాసులు ఎన్జీవో ప్రతినిధి చామంతి చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్వైజర్ హరీష్ పాల్గొన్నారు.

## అదనపు కట్నం కోసం పెళ్లికొడుకు పరారీ..

### పెళ్లికి రెండు రోజుల ముందు వరుడు కనిపించకుండా పోయాడు..

### వరకట్నం రూ.26 లక్షలు, అదనంగా రూ.9 లక్షలు డిమాండ్..

### పురుగుల మందు డబ్బాతో అబ్బాయి ఇంటి ముందు అమ్మాయి కుటుంబం బైఠాయింపు..

**కమలాపూర్: ప్రభాత వార్త.**



కమలాపూర్ మండలంలో అదనపు కట్నం కోసం పెళ్లికొడుకు పరారీ ఘటన కలకలం రేపింది. మార్చి 6వ తేదీన జరగాల్సిన పెళ్లికి రెండు రోజుల ముందే వరుడు కనిపించకుండా పోయాడని పెళ్లి కూతురు తండ్రి పొన్నాల రాజయ్య తెలిపారు. ఎల్కతుర్తి మండలం దండపల్లి గ్రామానికి చెందిన పొన్నాల రాజయ్య కుమార్తెకు కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన వీరబోయిన రాజయ్య చిన్నకుమారుడు కిరణ్‌తో వివాహం నిశ్చయమైంది. వరకట్నంగా రూ. 26 లక్షలకు పెద్దమనుషుల సమక్షంలో ఒప్పందం కుదిరినట్లు తెలిపారు. ఫిబ్రవరి 21, న ఎంగేజ్‌మెంట్ సమయంలో రూ. 10 లక్షలు అప్పగించి, అందరి సమక్షంలో మార్చి 6న, పెళ్లికి లగ్నపత్రిక రాసుకోవడం జరిగినది అని తెలిపారు. పెళ్లి సమయం దగ్గరపడుతున్న వేళ వరుడు కుటుంబ సభ్యులు అదనంగా రూ. 9 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. అంత మొత్తాన్ని ఇవ్వలేమని అమ్మాయి కుటుంబ సభ్యులు చెప్పడంతో పెళ్లికి రెండు రోజుల ముందు వరుడు పరారైనట్లు ఆరోపించారు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైనట్లు పొన్నాల రాజయ్య తెలిపారు. అబ్బాయి తల్లిదండ్రులే తమ కుమారుడిని దాచిపెట్టి అదనపు కట్నం కోసం పెళ్లిని నిలిపివేశారని అమ్మాయి కుటుంబ సభ్యులు ఆరోపించారు. పెళ్లి ఆగిపోవడంతో తమ పరువు పోయిందని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పురుగుల మందు డబ్బాతో అబ్బాయి ఇంటి ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

# నిర్దేశిత గడువులోగా ఇళ్ళ నిర్మాణం పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**ఇళ్ళ నిర్మాణం లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి**

వరంగల్ సిటి ఏప్రిల్7 ప్రభాతవార్త

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు.ఇళ్ళ నిర్మాణం లో నాణ్యత పాటించాలని అధికారులకు



సూచించారు.వరంగల్ నగరంలోని ఇందిరా నగర్ (గరీబ్ నగర్) జిడబ్ల్యుఎంసి 16వ వార్డులో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణం ఎంతవరకు పూర్తయ్యింది, ఇప్పటివరకు ఎంతమేర నిధులు విడుదలయ్యాయి, అనే విషయాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం నిర్మాణ పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని, పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 20 నుండి 26 వరకు సామూహిక గృహప్రవేశ కార్యక్రమాలను నిర్వహించనున్న నేపథ్యంలో,లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.కలెక్టర్ వెంట ఇందిరమ్మ ఇళ్ల జిల్లా నోడల్ అధికారి, జెడ్పి సీఈవో రామ్ రెడ్డి, హౌసింగ్ డి.ఇ.విష్ణువర్ధన్ రెడ్డి,ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పై అవగాహన ర్యాలీ

**జెండా ఊపి ర్యాలీ ప్రారంభించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

వరంగల్ సిటి ఏప్రిల్7 ప్రభాతవార్త

ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్‌లో విస్తృత స్థాయిలో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.మంగళవారం ఉదయం ఎంజీఎం ఆసుపత్రి నర్సింగ్ కళాశాల వద్ద నుండి ఎంజీఎం కూడలి వరకు"ఆరోగ్యమే మహా భాగ్యం" అంశంపై నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జెండా ఊపి ప్రారంభించారు.ఈ ర్యాలీ లో"మనవహారం" కార్యక్రమం నిర్వహించి,ఆరోగ్యమే మహాభాగ్యం అనే సందేశాన్ని స్లోగన్ల ద్వారా ప్రజలకు,బాటసారులకు చేరవేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రజలు శాస్త్రీయ దృక్పథంతో ఆరోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉండాలని




సూచించారు. ఆరోగ్యం అనేది కేవలం వ్యాధుల లేమి మాత్రమే కాకుండా శారీరక, మానసిక,సామాజిక సంక్షేమం కలగలిపిన సమగ్ర స్థితి అని తెలిపారు.ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో సమతుల ఆహారం తీసుకోవడం,నియమిత వ్యాయామం చేయడం, పరిశుభ్రత పాటించడం వంటి అలవాట్లను తప్పనిసరిగా అలవరచుకోవాలని సూచించారు.ముఖ్యంగా ఫాస్ట్ ఫుడ్,జంక్ ఫుడ్ వినియోగాన్ని తగ్గించి, మిల్లెట్ ఆహారం,పండ్లు, కూరగాయలు తీసుకోవాలి. ఒత్తిడి,ఆందోళనలను తగ్గించుకోవడానికి యోగా, పద్ధతులను అనుసరించాలని తెలిపారు.సీజనల్ వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, ఆరోగ్య పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు .అనంతరం ఎంజీఎం ఆసుపత్రిలో జిల్లా అధికారులకు, ఉద్యోగులకు ప్రత్యేక హెల్త్ క్యాంప్ నిర్వహించారు.ఈ క్యాంప్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్లు జి. సంధ్యారాణి, వై.వి. గణేష్ తదితరులు ఆరోగ్య పరీక్షలు చేయించుకు న్నారు.ఈ సందర్భంగా ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి అందరితో ఆరోగ్య సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో డిహెచ్ ఎస్ ఓ శ్రీనివాస్ రావు, జెడ్పీ సీఈవో రామిరెడ్డి,ఎంజీఎం ప్రాంతీయ కంటి ఆసుపత్రి సుపరింటెండెంట్స్ హరిచంద్ర రెడ్డి,జిల్లా అధికారులు,వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దళితరత్న అవార్డు గ్రహీత తుల్ల రవి ని అభినందించిన ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట/ఏప్రిల్ 07 ప్రభాత వార్త

మహానాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి ఉత్సవాల సందర్భంగా వరంగల్ జిల్లాలో సందడి నెలకొంది. ఈ వేడుకలను పురస్కరించుకుని, దళిత సేవా రంగంలో విశేష కృషి చేసినందుకు గాను వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తుల్ల రవి కి దళిత రత్న అవార్డు వరించింది. అవార్డ్ అందుకొని మొదటి సారి వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు తుల్ల రవిని శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా తుల్ల రవి దళిత రత్న అవార్డును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దళితరత్న అవార్డ్ గ్రహీత సిరిపెల్లి కొమురయ్య,నిరంజన్,బిర్రు రాజు,సుధీర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**సర్పంచ్ తౌటం లక్ష్మి**

చిట్యాల, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:



మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో బుధవారం శేర్ దయాబెటిక్, శరత్ మాక్స్విజన్ కంటి ఆసుపత్రి ల ఆధ్వర్యంలో బిపి, షుగర్, కంటి పరీక్షల ఉచిత శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని సర్పంచ్ తౌటం లక్ష్మి ‌ ్మ అంతయ్య తెలిపారు. ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. శిబిరంలో ఉచిత కంటి సంపూర్ణ పరీక్ష, చూపు పరీక్ష, ముత్య బిందు పరీక్ష, గ్లోకోమా పరీక్ష, షుగర్ బీపీ ఉన్నవారికి ప్రత్యేక కంటి పరీక్షలు, నిర్వహించి, అవసరమైన వారికి శస్త్ర చికిత్సల కోసం రెఫర్ చేయడం జరుగుతుందని తెలిపారు. శిబిరానికి హాజరయ్యే వ్యక్తులు ఆధార్ కార్డు విధిగా వెంట తీసుకురావాలని సర్పంచ్ తౌటం లక్ష్మి ‌ ్మ అంతయ్య తెలిపారు.

## గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

**15 లీటర్ల గుడుంబా స్వాధీనం. ..ఒకరిపై కేసు నమోదు**

**ఎస్ ఐ పోచంపల్లి సతీష్**

**గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవు**

చిట్యాల, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:



మండలంలోని పాసిగడ్డ తండ లో నిర్వహిస్తున్న గుడుంబా స్థావరాలపై ఎస్సై పోచంపల్లి సతీష్ ఆధ్వర్యంలో మెరుపు దాడులు నిర్వహించారు. నిషేధిత కుటుంబాను తయారు చేస్తున్న లావుడ్య సమ్మయ్య అలియాస్ తైలాల్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. 15 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారీకి ఉపయోగిస్తున్న బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. గుడుంబా తయారు చేస్తున్న సమ్మయ్య పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై సతీష్ మాట్లాడుతూ నిషేధిత కుటుంబాను తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో పట్టుబడిన వ్యక్తులు తిరిగి గుడుంబాను తయారు చేస్తే ఉపేక్షి ‌ ంచేది లేదని హెచ్చరికలు జారీ చేశారు. పద్ధతి మార్చుకొని సత్ప్రవర్తనతో జీవించాలని సూచించారు. గుడుంబా వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని గుర్తు చేశారు. గుడుంబా తయారు కి ఉపయోగించే ముడి సరుకులను కిరాణా యజమానులు విక్రయించవద్దని వ్యాపారస్తులను హెచ్చరించారు. ముడి సరుకులు విక్రయిస్తున్నారని తెలిస్తే షాపులపై దాడులు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై పోచంపల్లి సతీష్ హెచ్చరించారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ యాకయ్య, కానిస్టేబుళ్లు లాల్ సింగ్, రంజిత్, రాజు, హోంగార్డు రాజయ్య పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిని పరమార్శించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

చిట్యాల, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:

ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కటుకూరి మొగిలి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మొగిలిని పరమార్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తొందరగా కోలుకోవాలని ఆకాంక్షి ‌ ంచారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపిటిసి అటుకూరి పద్మ నరేందర్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి చిలుకల రాజ కొమురయ్య, యూత్ మండల అధ్యక్షుడు అల్లకొండ కుమార్, టౌన్ అధ్యక్షుడు గంగాధరి రవీందర్, నాయకులు అల్లంరాజు, సర్వ శరత్ కుమార్, క్యాతం మార్కండేయ, చిలుముల రాజమోళి నవాబుపేట సర్పంచ్ కొసరెడ్డి సాయి సుధా రత్నాకర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.



# మాతా శిశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**- సమయానికి వైద్యులు అందుబాటులో ఉండాలి**

**- జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా**

ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :



గర్భిణీల సంక్షేమమే లక్ష్యంగా వైద్యులు మెరుగైనసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని చంపక్‌హిల్స్ పరిధిలో గల మాతా -శిశు ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సందర్శించి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓపీ విభాగాన్ని తనిఖీచేసి, ఓపీసేవలను మరింతగా మెరుగుపరచాలని సూచించారు. ఆసుపత్రిలోని ప్రతీవార్డును సందర్శించి, అక్కడ అందుతున్న వైద్యసేవలు, సదుపాయాలను స్వయంగా పరిశీలించి, గర్భిణీలకు చేయించే వ్యాయామం సరిగా నిర్వహించాలన్నారు. అలాగే గర్భిణీ స్త్రీలతో కలెక్టర్ మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు గర్భిణీలు క్రమంతప్పకుండా అన్ని రకాల పరీక్షలు చేయించుకోవాలని, పోషకాహారం తీసుకోవాలని సూచించారు. అలాగే చిన్నపిల్లల ఆరోగ్యంపట్ల ప్రత్యేక దృష్టి సారించాలని, పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని ఇవ్వాలన్నారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, మందుల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న సేవలపై కలెక్టర్ ఆరాతీశారు. ఈ నేపథ్యంలో గర్భిణీలు, శిశువుల ఆరోగ్యం అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని సమగ్ర వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. గర్భిణీ స్త్రీలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని, ప్రసవాల సమయంలో తగిన వైద్య సదుపాయాలు సిద్ధంగా ఉండేలా చూడాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య మరింతగా పెంచాలని, ఆసుపత్రుల్లో పరిశుభ్రతను ఖచ్చితంగా పాటించాలని, అవసరమైన మందులు, పోషకాహారం అందుబాటులో ఉంచాలని, ప్రతి వైద్యులు బాధ్యతగా పని చేయాలని స్పష్టం చేశారు. రోగులతో సానుకులంగా వ్యవహరిస్తూ, వారికి మెరుగైన సేవలు అందించాలన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఆసుపత్రి రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ పరిశీలనలో ఎంసీహెచ్ సూపరింటెండెంట్ రాజలింగం, ఇతర సంబంధిత అధికారులు, వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఆరోగ్యదినోత్సవ వేడుకలు

**- ఆరోగ్యకర సమాజనిర్మాణంకోసం అందరం కృషిచేయాలి**

**- జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా**

జనగామ టౌన్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :





ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి అందరం కృషిచేయాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యమే సమాజాభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. ప్రజలందరికీ నాణ్యమైన ఆరోగ్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వివిధ విభాగాల వైద్యాధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అన్ని పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులపై ఆధారపడటాన్ని తగ్గించాలని సూచించారు. అందుకు కావలసిన సదుపాయాలను మెరుగుపరచడంలో అధికారులు కృషి చేయాలన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వ ఆసుపత్రుల పాత్రకీలకమని, ప్రతీఒక్కరూ ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకునేలా చూడాలన్నారు. వైద్య రంగంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. వివిధ ఆరోగ్య కేంద్రాల్లో, ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. వారి కృషి వల్ల ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోందన్నారు. అనంతరం ఈ నేపథ్యంలో ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన వివిధ విభాగాల వైద్యాధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలతో పాటు జ్ఞాపికలను అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, డీసీహెచ్ఎస్ శర్మ, సూపరింటెండెంట్‌లు, ప్రోగ్రామింగ్ అధికారులు, సీహెచ్‌సీ, పీహెచ్‌సీల వైద్యాధికారులు, వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశాలు, ఇతర సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతిలో పెండింగ్‌దరఖాస్తులను పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా**

జనగామ టౌన్, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :



భూ భారతిలోగల పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచి త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. మంగళవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీకాన్ఫరెన్స్ హాల్లో భూభారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియపై క్షుణ్ణంగా సమీక్షించి, పలుసూచనలు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ భూ భారతిలోగల వివిధ మాడ్యూల్స్‌లోని సక్సెషన్, మ్యుటేషన్, ఖాతా సమీకరణ, డేటా కరెక్షన్, అర్బన్ ల్యాండ్, కోర్టు కేసులు, జీపీపీ, పీపీబీ, నాలా, తదితరాల పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని, త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ఈ -ఆఫీసు విధానాన్ని అమలు చేయాలని సూచించారు. ఈ -ఆఫీసుపై శిక్షణ పొంది, వివిధ అంశాలలో అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ-ఆఫీస్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అమలు చేసి, సమన్వయంతో పని చేయాలని తెలిపారు. సమీక్ష సమావేశంలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, అన్ని మండలాల తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సిబ్బందికి అవార్డులు

రఘునాథపల్లి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :



ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మంగళవారం రఘునాథపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది ఎం.అయోధ్య, ఆశావర్కర్ బానోత్ మంజులకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఉత్తమ సేవా అవార్డులను ప్రధానం చేశారు. అదేవిధంగా జిల్లా వైద్యాధికారి మల్లికార్జున్‌చే ప్రశంస పత్రంను కూడా అందజేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ బి. స్రవంతి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రావ్‌కిషన్, సూపర్వైజర్లు సులోచన, సంజనా, రజని, విష్ణువర్ధన్ రెడ్డి, పాండరి, ఆరోగ్యకేంద్రం సిబ్బంది వారిని ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు.

# జనగామ వార్త



## అంటువ్యాధులు కాని వ్యాధులపై అవగాహన



బచ్చన్నపేట, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :

వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బచ్చన్నపేట మండలంలోని కొడవటూరు గ్రామంలోని పిహెచ్‌సి సబ్ సెంటర్లలో డా.సృజన ఆధ్వర్యంలో అంటువ్యాధులు కాని వ్యాధులపై హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంపులో మెడికల్ సిబ్బంది, ఆశలు, గ్రామ ప్రజలు మొత్తం 50మంది పాల్గొన్నారు.

## అంగన్వాడీ చైర్మన్‌గా సర్పంచ్ పేరబోయిన కళ్యాణి



బచ్చన్నపేట, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :

గోపాల్‌నగర్ గ్రామంలో అంగన్వాడీ కేంద్రాలను స్థానిక సర్పంచ్ పేరబోయిన కళ్యాణి పరుశురాములు తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణీలకు పంపిణి చేస్తున్న గుడ్లు, పాలు బాలామృతాన్ని పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రంలో అంగన్‌వాడీకేంద్రాల పర్యవేక్షణ బాధ్యతలు ప్రభుత్వం సర్పంచ్‌లకు అప్పగించింది. గోపాల్‌నగర్ సర్పంచ్ చైర్మన్‌గా రెండు అంగన్వాడీలలో కలిపి 22మందితో ప్రత్యేక కమిటీని నియమించారు. ఈ కమిటీలో అంగన్‌వాడీ టీచర్, వివో, పాఠశాల సైన్స్ టీచర్, రిటైర్డ్ ఉద్యోగి, వార్డు మెంబర్, ఆరుగురు చిన్నారుల తల్లులు సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ గర్భిణులు, తల్లులు, బాలింతలకు ప్రతీనెలా బియ్యం, పప్పు, బాలామృతం పంపిణీని ప్రతినెల పర్యవేక్షించనున్నారు. ఆరోగ్యలక్ష్మీ ద్వారా లబ్ధిదారులకు అందుతున్న భోజనాన్ని పరిశీలించి, చిన్నారుల తల్లులతో మాట్లాడారు. ఎలాంటి సమస్యఉన్న తమకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చింతల కర్ణాకర్, వార్డు మెంబర్లు గంగరబోయిన ఐలయ్య, వద్ధిక్రాంతి, మహాలక్ష్మి సుభాష్, మాజీ వార్డ్ మెంబర్లు బొమ్మె నర్సింలు, అంగన్వాడి టీచర్లు పస్తం లక్ష్మీ, పర్వతంభాగ్య, ఆయాలు పాల్గొన్నారు.

## హర్యానా భాషపై విద్యార్థులకు పరీక్షలు

దేవరుప్పుల, ఏప్రిల్ 7 ప్రభాతవార్త :



పీఎం శ్రీ ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా దేవరుప్పుల మండలంలోని కోలుకొండ జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. ఆరు, పది తరగతుల విద్యార్థులందరికీ హర్యానా భాషను 2025-26 విద్యాసంవత్సరంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ సిహెచ్.శ్రీనివాస్, ఎస్‌ఏ హిందీ నేర్పించి పరీక్ష నిర్వహించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు హెడ్మాస్టర్ పి.వెంకన్న, శ్రీనివాసులు బహుమతులు అందజేశారు. పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు శ్రీజ, అరుణ్, అక్షయ్, నిఖిత. మేఘన, సంస్కృతి, సర్వన్ ఉన్నారు. వీరందరికీ బహుమతుల ప్రధానంతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరీష్, శంకర్, ఇందిరా, సునీత, ఆంజనేయులు, మాధవ్, కిరణ్, శోభ తదితరులు పాల్గొన్నారు.

# నర్సంపేట వార్త

# పట్టణాన్ని మోడల్ సిటీగా తీర్చిదిద్దుతాం

## -పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

నర్సంపేట, ఏప్రిల్ 7, ప్రభాతవార్త

నర్సంపేట పట్టణాన్ని మోడల్ సిటిగా తీర్చిదిద్దుతామని నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం లక్ష్మీరామానంద్ అన్నారు. మంగళవారం నర్సంపేట మున్సిపల్ పరిధిలోని 26వ వార్డు స్థానిక కౌన్సిలర్ మండల శ్రీదేవి శ్రీనివాస్‌తో కలిసి వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ నర్సంపేట పట్టణాన్ని మోడల్ సిటీగా అన్ని రంగాలలో తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ఎమ్మెల్యే దొంతి సహకారంతో 26వ వార్డులో ఇటీవల దాదాపు 90,00000/ రూపాయలతో మెయిన్ రోడ్డు నుండి జయశ్రీ థియేటర్ నుండి పెద్ద కాలువ వరకు సీసీ రోడ్డు, మెయిన్ రోడ్డు భవాని టెంట్ హౌస్ నుండి పెద్ద కాల్వ వరకు సీసీ రోడ్డు, సైడ్ కాలువ, మెయిన్ రోడ్డు సెంట్రల్ బ్యాంకు నుండి పెద్ద కాలువ వరకు సీసీ రోడ్డు కల్వర్టులు, పెద్ద కాలువ వెనుక కాలనీలో సీసీ రోడ్డు, పెద్ద కాలువపై డబుల్ సీసీ



రోడ్డు, సంజీవని అనాధ ఆశ్రమం వద్ద దాదాపు 100 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. పార్టీలకతీతంగా వార్డులను అభివృద్ధి చేయడమే తమ కర్తవ్యంమన్నారు. ఎమ్మెల్యే స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు పర్యటనకు వచ్చినప్పుడు పలు హామీలను ఇవ్వడం జరిగిందని, ఎన్నికలు ముగిసి పాలకవర్గం ఏర్పడిన వెంటనే వాటిని అమలు చేసే దిశగా ముందుకు వెళ్తున్నామన్న విషయాన్ని వార్డు ప్రజలకు గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని తప్పక నెరవేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అంతే కాకుండా నేడు వార్డులో పర్యటిస్తున్నప్పుడు మా దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. వార్డులో అవసరమైన సీసీ రోడ్లు, సైడ్ కాలువలు, పెద్ద కాలువపై అవసరమైన చోట కల్వర్టులు నిర్మాణాలు చేపట్టి వార్డు అభివృద్ధికి సహకరిస్తామని అన్నారు. వార్డులోని నీటి సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టి నీటి సమస్య రాకుండా చర్యలు చేపడతామన్నారు. అదే విధంగా పారిశుద్ధం, సానిటేషన్ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కాట భాస్కర్, నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్, మాజీ వార్డు సభ్యులు గాజుల రమేష్, మాజీ ఎంపీటీసీ కాట ప్రభాకర్, వార్డు ఆఫీసర్లు కాట శ్రీనివాస్, సుష్మ, వార్డు జవాన్ మాదాసి భరత్, వార్డు నాయకులు మేడం కుమార్, కొత్తగట్టు ప్రశాంత్, కొత్తగట్టు కుమార్, దేశీ సాయి పటేల్, కీసరి రాంబాబు, కాట అఖిల్, నల్గొండ వంశీ, మండల గణేష్, కొత్తగట్టు సాయిరాజు, ఊగ సాయి చరణ్, దేవోజు హేమంత్, చీకటి శివమణి, గుండెబోయిన కోటి, అడుప రాంబాబు, నాడెం రామకృష్ణ, రవి, శ్రీనివాస్, రమేష్, వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫేర్‌వెల్ డే వేడుకలు

నర్సంపేట, ఏప్రిల్ 7, ప్రభాతవార్త

ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), నర్సంపేటలో మంగళవారం విద్యార్థుల కోసం ఫేర్‌వెల్ డే వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మల్లం నవీన్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బైరి సత్యనారాయణ, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కందాల సత్యనారాయణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్ కమలాకర్, స్టాఫ్ సెక్రటరీ ఎం.ఎం.కె. రహీముద్దీన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాంబాబు, డాక్టర్ సంధ్య తో పాటు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ మాట్లాడుతూ, కళాశాల విడిచి వెళ్లే ప్రతి విద్యార్థి తన జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని



ఆకాంక్షించారు. విద్య అనేది కేవలం ఉద్యోగానికే పరిమితం కాకుండా, మంచి వ్యక్తిత్వం, సమాజం పట్ల బాధ్యత, క్రమశిక్షణ, విలువలను పెంపొందించేదిగా ఉండాలని పేర్కొన్నారు. కళాశాలలో గడిపిన మధుర జ్ఞాపకాలను స్మరించుకుంటూ, విద్యార్థులు తమ భవిష్యత్తును ధైర్యంగా, నమ్మకంతో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కందాల సత్యనారాయణ తన ప్రసంగంలో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, క్రమపద్ధతిలో శ్రమించి విజయాన్ని సాధించాలని సూచించారు. విద్యార్థి దశలో ఏర్పడే ఆత్మవిశ్వాసం, సమయపాలన, విలువలు భవిష్యత్తు విజయాలకు పునాది అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కూడా భావోద్వేగపూర్వక ప్రసంగాలు చేస్తూ, కళాశాలలో గడిపిన అనుభవాలు, అధ్యాపకుల మార్గదర్శనం, స్నేహితులతో ఏర్పడిన అనుబంధాలను గుర్తుచేసుకున్నారు. కొందరు విద్యార్థులు తమ విజయాలకు కళాశాల ఉపాధ్యాయులే ప్రేరణ అని పేర్కొంటూ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్సాహభరితమైన డ్యాన్సులు, వినోదాత్మక ప్రదర్శనలు, భావోద్వేగపూరిత క్షణాలు కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చాయి.

# విద్యార్థులకు సైకిల్స్ అందించిన రోటరి క్లబ్

నర్సంపేట, ఏప్రిల్ 7, ప్రభాతవార్త

రోటరీ క్లబ్ వారిచే జడ్పిహెచ్ఎస్ గురజాల విద్యార్థిని విద్యార్థులకు సైకిళ్ళలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన పంపిణి చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ అధ్యక్షులు కొండూరు శివప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు రవాణా సౌకర్యం లేని దూర ప్రాంతాల నుండి వస్తున్న విద్యార్థిని విద్యార్థుల కోసం ప్రతి సంవత్సరం వందల సంఖ్యలో సైకిల్లను అందిస్తున్నామని అవి వారు సకాలంలో పాఠశాలకు రావడానికి నిరాటంకంగా వారు చదువును కొనసాగించడానికి దోహదపడతాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న బీద విద్యార్థులకు రోటరీ క్లబ్ ద్వారా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. కూర్చోవడానికి డ్యూయల్ డెస్కును అందిస్తున్నామని బాలికల ఆరోగ్య పరిరక్షణ కోసం శానిటరీ ప్యాడ్స్ విద్యార్థినీ విద్యార్థుల పటనాభివృద్ధి కోసం ప్రత్యేక



కార్యక్రమాన్ని తీసుకొని పట్నాభివృద్ధికి అవసరమైనటువంటి మెటీరియల్ను అందిస్తున్నామని విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని రీడింగ్ ఎబిలిటీని సాధించాలని కోరారు. విద్యాభివృద్ధికి రోటరీ క్లబ్ నిరంతరం పాటుపడుతున్నదని వివరించారు. విద్యార్థిని విద్యార్థులు చిన్ననాటి నుంచే సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని కష్టించి చదువుకొని అత్యున్నత శిఖరాలను అందుకోవాలని ఆ తరువాత చదువుకున్న పాఠశాలకి గ్రామానికి తమ సేవలను అందించాలని ఉద్బోధించారు. పాఠశాలల్లో ఇంట్రాక్టివ్ రోటరీ క్లబ్లను ఏర్పాటు చేస్తున్నామని గురజాల పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరం నుండి ఇంట్రాక్టివ్ రోటరీ క్లబ్ ఏర్పాటు చేసి వాటిలో విద్యార్థులను చేర్చుకొని వారిలో సేవా దృక్పథాన్ని పెంపొందించడానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండారి చంద్రరావు, గురజాల విద్యాభివృద్ధి కమిటీ బాధ్యులు గాది సాంబయ్య, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి పార్థసారథి, ఉపాధ్యాయ బృందం పి అర్పిత, ఈ చంద్రశేఖర్, ఎంఏ సాదత్, ఏ చంద్రకళ, ఎండి రాయిబోస్, ఎం నాగరాణి, వి రవికుమార్, బి రవీందర్, బి రమేష్, ఏం రాజేష్, సిహెచ్ సంతోష్ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# 10వ వార్డులో కొత్త ట్రాన్స్ ఫార్మర్ ప్రారంభించిన చైర్మన్

నర్సంపేట, ఏప్రిల్ 7, ప్రభాతవార్త



పట్టణంలోని 10వార్డు వివేకానంద కాలనీలో కాలువ కట్టమీద కొత్త ట్రాన్స్ ఫార్మర్‌ను మున్సిపాలిటీ చైర్ పర్సన్, పెండెం లక్ష్మీరామానంద్ కౌన్సిలర్ హన్మకొండ శ్రీధర్ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10 వార్డు వివేకానంద కాలనీ ప్రజలు కరెంట్ సరఫరా సరిగా లేకపోవడం, ఓవర్ లోడ్ తో జంపర్ కాలి పోవడంతో కరెంట్ పోవడం జరుగుతుండేది దీని వలన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించి వివేకానంద కాలనీ కొంత ఏరియాకి కొత్త ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రజలు కరెంట్ సమస్యతో ఇబ్బందులు పడకుండా ఉండటం కోసం కొత్త ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. నర్సంపేట పట్టణంలో ప్రజలు విద్యుత్ సమస్యలు రాకుండా తక్షణమే విద్యుత్ అధికారుల సహకారంతో సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామనీ, ముఖ్యంగా వార్డు లో కరెంట్ సమస్యలు రాకుండా చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీరామోజు రోజా రాణి, విద్యుత్ శాఖ ఎఈ, అశోక్, వార్డు సభ్యులు దార గణేష్, అరెపెల్లి బాబు, మహేందర్, మారపెల్లి అశోక్, పాశికంటి రమేష్, లైన్ ఇన్స్పెక్టర్, లైన్ మెన్ తదితరులు పాల్గొన్నారు.

# మన మనుగడ కోసం మొక్కలు పెంచాలి



దుగ్గొండి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త

మానవ మనుగడ కోసం మొక్కలను పెంచి రక్షించాలని స్థానిక సర్పంచ్ మోడెం శ్రీలత మల్లేషం అన్నారు. తిమ్మంపేట గ్రామంలో మంగళవారం వన నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సరీలో ఎన్ని మొక్కలను పెంచుతున్నారు. మొక్కలను చావకుండా చూసుకోవాలన్నారు. వన సేవకులు వన నర్సరీలను బాగా చూసుకోవాలన్నారు. రాభోయే వర్షాకాలంలో ప్రతి రైతుకు అందేవిధంగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యాదలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ గ్రామీణ ఉపాధిహామి పనులను వేగవంతం చేయాలి

దుగ్గొండి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త



జాతీయ గ్రామీణ ఉపాధిహామి పథకం పనులను వేగవంతం చేయాలని ఎంపిడివో డా.లెక్కల అరుందతి అన్నారు. మండలంలోని మైసంపల్లి గ్రామ పంచాయతీని మంగళవారం సందర్శించారు. ఉపాధిహామి పథకం పనులు గ్రామంలో పారిశుద్ద్యం వన నర్సరీ మొక్కల పెంపకం గుర్చి అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలంలో నీటి కొరత లేకుండా మంచినీటి సరఫరాను అడిగి తెలుసుకున్నారు. పలు అంశాలపై అవగాహన కలినపంచారు. అనంతరం ఎంపిడివోను స్థానిక సర్పంచ్ వేముల ఇంద్రదేవ్ శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆనందం, వార్డు మెంబర్లు సుమలత, సురేందర్, గంగారపు రజిత, ఇటుకాల రవి, విజయలత, శత్రజ్ఞ, ఫీల్డ్ అసిస్టెంట్ కవిత, పంచాయతీ కార్యదర్శి దివ్య, ఇటుకాల వేణు, చలగాని సదానందం, కారోబార్ వేముల సారంగం తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ వార్త
భూపాలపల్లి, కాటారం, ఏటూర్‌నాగారం, ములుగు

# మండలంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి పర్యటన

**మొగుళ్లపల్లి, ప్రభాత వార్త, ఏప్రిల్ 07:**

మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు మరియు విద్యా వ్యవస్థపై పర్యవేక్షణను మరింత బలోపేతం చేసే దిశగా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి మంగళ వారం విస్తృత పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని జెడ్‌పి ఎస్ ఎస్ పాఠశాలలో కొనసాగుతున్న 10వ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. పరీక్షల నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, హాల్ ఏర్పాట్లు తదితర అంశాలను సమీక్షించి, ఎలాంటి లోపాలు లేకుండా పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం పాత ఇస్సిపేట గ్రామాన్ని సందర్శించిన అదనపు



కలెక్టర్, ఈజీయస్ పథకం కింద కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై ఆరా తీస్తూ, కార్మికుల హాజరు నమోదు ను పరిశీలించారు. పనులు నాణ్యతతో, వేగంగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదే గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను కూడా ఆమె పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మేస్త్రికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తదుపరి మెగుళ్లపల్లి గ్రామంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ హాస్టల్‌ను కూడా తనిఖీ చేసి, ప్రజలకు అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. అవసరమైన చోట మెరుగులు చేర్చాలని సంబంధిత అధికారులకు సూచనలు అందించారు. ఈ పర్యటనలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. సురేందర్, ఏపిఓ మాధవి, ఈసి రాము, సంబంధిత గ్రామాల సర్పంచులు మరియు గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్..

**టేకుమట్ల ఏప్రిల్ 7 ప్రభాతవార్త:**



99 రోజుల్లో ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా టేకుమట్ల మండలంలోని వెలిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రపంచ ఆరోగ్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు గ్రామాలలోని ప్రజలకు అందిస్తున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్ సి డి, స్కానింగ్ గర్భిణీ స్త్రీలకు నమోదు ప్రక్రియ ఎలా అవుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోజు వారు జరిగే ఔట్ పేషెంట్స్ కు అందిస్తున్నటువంటి సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ ను, రోగులకు ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్నటువంటి సేవలను పర్యవేక్షించడం. ఆశా వర్కర్లు నిత్యం గ్రామాలలో ప్రజలకు తగు సేవలందించాలని సూచించారు. మాత శిశు సంరక్షణ, గర్భిణీలకు ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తూ, సుఖ ప్రస్తావాలు జరిగేలా చూడాలని, మాత శిశు మరణాలు శూన్యం కావాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టేకుమట్ల తాసిల్దార్ స్వరూపారాణి, ఎంపీడీవో అనిత, ప్రభుత్వ వైద్య అధికారి హారిక, వెలిశాల గ్రామ సర్పంచ్ బొడ్డు తిరుపతి, జిల్లా ఇన్ నైజేషన్ ఆఫీసర్ నాగరాణి, హెల్త్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి, హెచ్ వి పి విజయ్, ల్యాబ్ టెక్నీషియన్ బుచ్చిబాబు, స్టాఫ్ నర్స్ చిత్ర, కాంచన, డీఈఓ రమేష్, ఏ నేమ్స్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

**చిట్యాల, ఏప్రిల్ 7 ప్రభాతవార్త:**



మండల కేంద్రానికి చెందిన సిలి వేరు తిరుపతి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, మాజీ ఎంపీటీసీ కట్కూరి పద్మ నరేందర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వారి వెంట మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమురయ్య, వార్డు సభ్యుడు శనిగరపు మొగిలి, గుర్రపు అశోక్, తదితరులు ఉన్నారు.

## శాస్త్రీయ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

**చిట్యాల ఏప్రిల్ 7 ప్రభాతవార్త:**



మండలంలోని గోపాలపురం గ్రామంలో మహబూబాబాద్ జిల్లా మల్యాల ఉద్యాన వన శాఖ ఆధ్వర్యంలో మిరప తోటలను మంగళవారం సందర్శించారు. శాస్త్రవేత్త డాక్టర్ ఏ అట్లూరి ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో మిరప తోటలను క్షేత్రస్థాయిలో సందర్శించి పలు సూచనలు చేశారు. సమగ్ర యాజమాన్య పద్ధతుల ద్వారా మిరప పంట లో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. మిరప పంటలో నాణ్యతను పెంచేందుకు సరియైన పద్ధతుల్లో అంట అవశేషాల నిర్వహణ, నేల ఆరోగ్య సంరక్షణ, ఎరువుల సమతుల్య వినియోగం, కీటక వ్యాధి నియంత్రణ చర్యల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. రైతులు ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా ఖర్చులను తగ్గించుకోవచ్చని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కూరగాయల సాగుపై ప్రత్యేక దృష్టి సారించిందని, రైతులు కూరగాయల సాగుపై మక్కువ పెంచుకోవాలని కోరారు. జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో కూరగాయల సాగుపై వాలంటీర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంటల రక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కూరగాయల మినీ విత్తనాల ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి ఏ సునీల్ కుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి మని, విస్తరణ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన ఎమ్మార్వో లక్ష్మీరాజం

**భూపాలపల్లి టౌన్, ఏప్రిల్ 06, ప్రభాతవార్త :**



భూపాలపల్లి తహసిల్దార్ గా లక్ష్మీ రాజం పదవి బాధ్యతలు స్వీకరించారు.. ఈ సందర్భంగా ఆయనను కార్యాలయ సిబ్బంది, గ్రామ పాలన అధికారులు శాలువాతో సన్మానించి పూల బోకెను అందించారు.. అనంతరం తహసిల్దార్ లక్ష్మీ రాజం మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ కు సంబంధించిన సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా కార్యాలయంలో దరఖాస్తు చేసుకొని సంప్రదించాలని వారి సమస్యలు సత్వరమే పరిష్కార దిశగా తమ వంతు కృషి ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు.. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎమ్మార్వో అంజలి రెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామస్వామి, గ్రామ పాలనాధికారి బండి శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు..

## పిహెచ్‌సీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ అవగాహన సదస్సు

**మొగుళ్లపల్లి, ప్రభాత వార్త, ఏప్రిల్ 07:**



ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 కార్యక్రమంలో భాగంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మొగుళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం డాక్టర్ నవత ఆధ్వర్యంలో నిర్వహించగా జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ అసంక్రమణ వ్యాధులు అయిన బిపి, షుగర్, క్యాన్సర్ వంటి వ్యాధులను నియంత్రించడంలో ఆశా కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం ద్వారా ఈ వ్యాధులను ముందుగానే గుర్తించి నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమం అనంతరం అదనపు కలెక్టర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సమగ్రంగా తనిఖీ చేసి, ప్రతి విభాగంలోని సదుపాయాలు, సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. సేవల మెరుగుదలకు అవసరమైన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మొగుళ్లపల్లి సర్పంచ్ చాట్ల విజయ రవి, ఎంపీడీఓ సురేందర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె. రాజేంద్రప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఆసుపత్రి సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొగుళ్లపల్లి గ్రామంలో సీసీ కెమెరాల పునరుద్ధరణ

### ఎస్సై ముప్పు సురేష్ చొరవ ప్రశంసనీయం

**మొగుళ్లపల్లి,ప్రభాత వార్త, ఏప్రిల్ 07:**

మండలంలోని మొగుళ్లపల్లి గ్రామంలో ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన సుమారు 24 సీసీ కెమెరాలు కొంతకాలంగా పనిచేయకుండా నిలిచిపోయాయి. దీంతో గ్రామ భద్రతా వ్యవస్థ కొంత మేర బలహీనపడిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితిని గమనించిన స్థానిక ఎస్సై ముప్పు సురేష్ స్వయంగా చొరవ తీసుకుని కెమెరాల పునరుద్ధరణ పనులు చేపట్టించారు. ప్రత్యేక శ్రద్ధతో మరమ్మతులు నిర్వహించి, అన్ని సీసీ కెమెరాలు తిరిగి సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకున్నారు. ఎస్సై చేసిన ఈ చర్య గ్రామ భద్రతను బలోపేతం చేయడంలో కీలకంగా మారింది. సీసీ కెమెరాల పునరుద్ధరణతో నేరాల నియంత్రణకు తోడ్పాటు లభించడంతో పాటు, అనుమానాస్పద కార్యకలాపాలను పర్యవేక్షించడం సులభమైంది. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేందుకు పోలీసులకు మరింత సహకారం అందుతోంది. ఈ సందర్భంగా ఎస్సై ముప్పు సురేష్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యమని తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా భద్రత మరింత మెరుగుపడుతుందని, ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. గ్రామస్థులు ఎస్సై చొరవను అభినందిస్తూ, పోలీసులపై తమ విశ్వాసం మరింత బలపడిందని తెలిపారు.



# రౌడీషీటర్ హరీష్‌కు జీవిత ఖైదు

-మహబూబాబాద్

## కోర్టులో సంచలన తీర్పు

మహబూబాబాద్ క్రైమ్,ఏప్రిల్7,ప్రభాతవార్త:



మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలానికి చెందిన రౌడీషీటర్ హరీష్‌కు జీవిత ఖైదు విధిస్తూ మహబూబాబాద్ కోర్టులో సంచలన తీర్పు వెలువడింది. వివరాల్లోకి వెళితే 2020ఆగస్టు23న కేసముద్రం మండలం గిర్నితండాకు చెందిన ఆంగోతు హరీష్(30) అనే వ్యక్తి రౌడీగా ఎదుగాలనే ఉద్దేశ్యంతో అనంతపురం జిల్లాకు చెందిన బిచ్చగాడు వెంకన్నను లక్ష్యంగా చేసుకొని కేసముద్రం రైల్వే స్టేషన్ ప్రాంతంలో పారతో దాడి చేసి కత్తితో తలను, మొండెంను వేరుచేసి హత్యచేశాడు. అప్పటి ఎస్సై సతీష్ వీఆర్ఓ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అప్పటి రూరల్ సీఐలు వెంకటరత్నం, రవికుమార్‌లు ఆధారాలు సేకరించి నిందితున్ని అరెస్ట్ చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నిందితునిపై అక్రమ వసూళ్ళు, హత్యాయత్నం, దొంగతనం మొత్తం కలిపి 18కేసులు నమోదైయ్యాయి. కేసముద్రం సీఐ సత్యనారాయణ, ఎస్సై క్రాంతి కిరణ్ బాధ్యతలు చేపట్టిన అనంతరం రౌడీషీటర్ నుండి ప్రజలకు, వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. జిల్లా కోర్టు సమగ్ర సాక్ష్యాదారాలను పరిశీలించి నిందితుడు ఆంగోతు హరీష్‌ను దోషిగా తేల్చి జీవిత ఖైదుతో పాటు రూ.30వేలు జరిమానా విధించారు. ఈ మేరకు కేసముద్రం ప్రాంత ప్రజలు పోలీస్‌శాఖ కృషిని అభినందించారు.

మహబూబాబాద్ వార్త
మహబూబాబాద్, తొర్రూరు

## విలీన గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలి

మహబూబాబాద్ అగ్రికల్చర్,ఏప్రిల్7,ప్రభాతవార్త:




మున్సిపాలిటీల్లో విలీన మైన గ్రామాల్లో ఉపాధి పనులను కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక గ్రామీణ ఎపేదల సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పనులను మహబూబాబాద్ మున్సిపాలిటీ విలీన గ్రామాలకు కల్పించి చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. అదేవిధంగా భూమిలేని వ్యవసాయ కార్మికులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.12వేలు ఇవ్వాలని, అర్హులైన వారికి పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, యాకమ్మ, ఉమ, రామనర్సయ్య, యాకమ్మ, కనకయ్య, వీరయ్య, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ ఉపాధ్యాయులకు పీఆర్సి ప్రకటించాలి

మహబూబాబాద్ టౌన్,ఏప్రిల్7,ప్రభాతవార్త:




ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే పీఆర్సిని ప్రకటించాలని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సామ మల్లారెడ్డి కోరారు. మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో మురళీకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చి 2024 నుండి పదవి విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయుల పదవీ విరమణ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. పీఆర్సి నివేదికను తెప్పించి 30శాతానికి తగ్గకుండా ఫిట్‌మెంట్ చెల్లించాలన్నారు. 30, 40సంవత్సరాలు సేవ చేసి పదవి వవిరమణ చెందిన తర్వాత బకాయిలు రాక అనేక మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు మానసిక ఆందోళన చెందుతున్నారన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల కరువు బత్యాన్ని విడుదల చేయాలన్నారు. పెండింగ్ బిల్లులను ఏక కాలంలో చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా హెల్త్‌కార్డుల జీవో విడుదల చేయాలన్నారు. మోడల్‌స్కూల్, గురుకుల ఉపాధ్యాయులకు 010 వేతనాలను అమలు చేయాలని, కేజీబివి సిబ్బందికి టైం స్కేల్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకుబ్, జిల్లా కార్యదర్శి వివేక్, బండి నర్సింహరావు, సభ్యులు శంకర్, శ్రీనివాస్, రాములు, వెంకట్రామనర్సయ్య, శ్రీనివాస్, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జీవో 98ని రద్దు చేయాలి

గార్ల,ఏప్రిల్7,ప్రభాతవార్త:

మున్నేరు నీటిని గార్ల పరివాహక ప్రాంతానికి కేటాయించాలని బిఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్ నాయక్, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు విశ్వ జంపాల డిమాండ్ చేశారు. మున్నేరు పాలేరు లింక్ కేనాల్ సర్వేలో భాగంగా మంగళవారం వివిధ పార్టీల నాయకులను ముందస్తు అరెస్టులు చేపట్టారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ వారు మాట్లాడుతూ అక్రమ లింక్ కెనాల్ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 204కోట్లు కేటాయించిందని, మండలంలో చుక్కనీరు లేకుండా కుట్రలు పన్నుతున్నారన్నారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ గార్ల మండల కేంద్రంలో అన్ని పార్టీల నాయకులు ప్రజలు నిరసన ప్రదర్శించి అక్రమ అరెస్టులను ఖండించారు. అరెస్ట్ అయిన వారిలో లక్ష్మణ్‌నాయక్, విశ్వ జంపాల, కట్టెబోయిన శ్రీనివాస్, సత్యనారాయణ, శ్రీనివాస్, వెంకన్న, రాధాకృష్ణ, సక్రు, సత్యం, రమేష్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



## కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన మధుకర్ రెడ్డి సన్మానం

బయ్యారం,ప్రభాతవార్త,ఏప్రిల్ 7.



బయ్యారం మండలం లక్ష్మి నర్సింహపురం గ్రామానికి చెందిన సొసైటీ మాజీ చైర్మన్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు మూల మధుకర్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా ఇటీవల నియమించారు.మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ సర్పంచుల ఆధ్వర్యంలో మధుకర్ రెడ్డినీ శాలువాతో ఘనంగా సన్మానించి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఇటీవల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు అధ్యక్షతన పీసీసీ పర్యవేక్షణ పూర్తిస్థాయిలో జిల్లా కమిటీని నియమించారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు భూక్య ప్రవీణ్ నాయక్,సరస్వతి రాందాస్ నాయక్,లింగ్యా నాయక్,పార్వతి,పనుగోత్ వెంకన్న, సేవాలాల్,బాలకృష్ణ,రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## భూ వైవిధ్య పరిరక్షణలో విద్యార్థుల పాత్ర కీలకం


చిన్నగూడూరు ఏప్రిల్ 7, ప్రభాత వార్త:



జయ్యారం లో నీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు భూ వైవిధ్యం పరిరక్షణ విద్యార్థుల పాత్ర కీలకం అదేవిధంగా భూసార పరీక్షల ఆవశ్యకత మరియు మట్టి నమూనాల సేకరణ సేకరణ పై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అధిక మోతాదులో ఎరువులు మరియు పురుగుమందులు వాడడం వలన భూమి కాలుష్యం ఏర్పడుతుంది కాబట్టి భూమి పరీక్ష చేసుకోవడం వలన రైతులకు ఎంత మోతాదులో ఎరువులు వేయాలి అని అవగాహన కలిగి ఉండాలని రేపటి భావి భారత పౌరులు విద్యార్థులకు మట్టి నమూనా పరీక్షలు ఎలా చేయాలి అనే విషయంలో అవగాహన కలిగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భాస్కర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులుఉష శ్రీ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మరిపెడ, ఏప్రిల్ 7 ప్రభాతవార్త



మరిపెడ పట్టణ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (దిలీళినీ) చెక్కులను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి అందజేశారు. డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రాంచంద్రు నాయక్ కృషితో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరుతున్నాయని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం, ఆర్థిక సమస్యలను దృష్టిలో ఉంచుకుని సిఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందిస్తోందని, అవసరమైన వారికి ఈ నిధులు ఎంతో ఉపయుక్తంగా మారుతున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ జాటోతు సురేష్, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు షేక్ తాజుద్దీన్, నాయకులు అలువాల ఉపేందర్ ప్రజాపతి, గంధసిరి భిక్షపతి, చీనా తదితరులు పాల్గొన్నారు.

## జలసాధన కమిటీ సభ్యుల అక్రమ అరెస్టులను ఖండించండి

ఏఐకేఎంఎస్ రాష్ట్ర కోశాధికారి వెంకటేశ్వర్లు

బయ్యారం,ప్రభాతవార్త,ఏప్రిల్ 7.



ఏజెన్సీలో అక్రమ భూ ఆక్రమణాలను. సర్వే పనులను తక్షణమే నిలిపివేయాలి. మున్నేరు జలదోపిడికి వ్యతిరేకంగా జీ.వో నెంబర్ 98 కు వ్యతిరేకంగా పోరాడుతున్న గార్ల మండలం మున్నేరు జలసాధన కమిటీ సభ్యులను మంగళవారం ఉదయం తెల్లవారుజామున నాలుగు గంటలకు ఇళ్ల దగ్గర ఉన్న జలసాధన కమిటీ నాయకులను రైతులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని బయ్యారం మండలానికి చెందిన అ ఖిలభారత రైతుకూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు తీవ్రంగా ఖండించారు.అరెస్టు చేసిన నాయకులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.వందల మంది పోలీసులను కాపలా పెట్టి గార్ల ఏజెన్సీ మండలంలో గిరిజనుల గిరిజనేతరుల భూములను అక్రమంగా దురాక్రమణ చేసుకొని ఇక్కడి భూములకు నీళ్ల ఇవ్వకుండా భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయకుండా అన్యాయంగా నీటిని దోపిడీ చేసుకుపోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం శతవిధాల ప్రయత్నాలు కొనసాగిస్తూ అక్రమ అరెస్టులకు పాల్పడుతుందని విమర్శించారు.ఈ ప్రాంత ప్రజలు తమ భూములను కోల్పోవడమే గాక ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటిపోయి గార్ల ఏజెన్సీ మండలం ఎడారిలా మార్చేందుకు కష్టపడుతున్నారని విమర్శించారు.ఇప్పటికైనా ప్రభుత్వం వాటికి స్వస్తి పలికి ఈ ప్రాంత భూములకు సాగునీరు అందించే చర్యలు తక్షణమే చేపట్టి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## బాధిత కుటుంబానికి సర్పంచ్ వర్స దీప ప్రకాష్ దొర ఆర్థిక చేయూత

బయ్యారం,ప్రభాతవార్త,ఏప్రిల్ 7.

బయ్యారం మండలంలోని నామాలపాడు పంచాయతీ పరిధిలో రామికుంట గ్రామానికి చెందిన సూరబోయిన రాంబాబు తండ్రి ముత్తయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాన్ని సర్పంచ్ వర్స దీపప్రకాష్ దొర పరామర్శించి మనోధైర్యం కల్పించి వారి కుటుంబానికి 50కేజీల బియ్యం, రూ.2వేలు ఆర్థిక సహాయం అందించారు. సూరబోయిన రాంబాబు,వార్డు సభ్యులు గొగ్గల రామకృష్ణ, సమ్మయ్య, తుర్సం యర్రయ్య,పాయం వెంకన్న,బాలకృష్ణ,షేక్ పాషా,బిను ఉపేందర్, సాయి,దబ్బా అంజి, రియాజ్,వెంకటమ్మ పాల్గొన్నారు.



# ఇనుగుర్తి మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో సమన్వయ లోపం

**సొంత హమాలీలతో కాంటా వేయిస్తామన్న**

**చిన్నముప్పారం రైతులు**

**కుదరదన్న ఇనుగుర్తి హమాలీ యూనియన్**

**నేడు కొనుగోలు కేంద్రం వద్ద ఇరువర్గాల చర్చ**

*ఇనుగుర్తి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:*

మండల కేంద్రమైన ఇనుగుర్తిలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో కాంటాల (తూకం) ప్రక్రియలో జాప్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి రైతులు ఒకే కేంద్రానికి మొక్కజొన్నలను తీసుకువస్తుండటంతో సెంటర్ వద్ద భారీ రద్దీ నెలకొంది. ఈ క్రమంలో త్వరగా కాంటాలు పూర్తి చేసుకోవాలన్న చిన్నముప్పారం రైతుల ప్రయత్నాలకు, స్థానిక ఇనుగుర్తి హమాలీ యూనియన్ కు మధ్య తీవ్ర వివాదం తలెత్తింది. మండలం మొత్తానికి ఇనుగుర్తిలో ఒకటే మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో, ప్రతిరోజూ పెద్ద ఎత్తున మొక్కజొన్నల బస్తాలు వస్తున్నాయి. రద్దీకి తగ్గట్టుగా హమాలీలు లేకపోవడంతో రైతులు రోజుల తరబడి కేంద్రాల వద్దే పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఈ సమస్యను అధిగమించేందుకు మంగళవారం చిన్నముప్పారం గ్రామానికి చెందిన కొందరు రైతులు కొనుగోలు కేంద్రం వద్దకు చేరుకుని హమాలీ యూనియన్ తో ఒక ప్రతిపాదన చేశారు. చిన్నముప్పారం క్లస్టర్ కు చెందిన రైతుల ధాన్యాన్ని, ఇనుగుర్తి హమాలీలతో సంబంధం లేకుండా.. తమ సొంత గ్రామ హమాలీలు మరియు బీహార్ కు చెందిన హమాలీల ద్వారా సపరేట్ గా కాంటా వేయించుకుంటామని తెలిపారు. ఇలా చేయడం ద్వారా తమ గ్రామం వరకే కాకుండా, సెంటర్ పై భారం తగ్గి మిగతా గ్రామాల రైతుల కాంటాలు కూడా అత్యంత వేగంగా పూర్తవుతాయని వివరించారు. చిన్నముప్పారం రైతుల ప్రతిపాదనను ఇనుగుర్తి హమాలీ యూనియన్ తీవ్రంగా వ్యతిరేకించింది. బయటి వ్యక్తులను అనుమతించేది లేదని, అన్ని గ్రామాల మొక్కజొన్నలను తామే కాంటా వేస్తామని పట్టుబట్టారు. ఇది ఒకరకమైన వితండవాదమని, రైతుల ఇబ్బందులను పట్టించుకోకుండా గుత్తాధిపత్యం ప్రదర్శించడం సరికాదని చిన్నముప్పారం రైతులు అసహనం వ్యక్తం చేశారు.



**మొక్కజొన్న రైతులకు ఇబ్బంది కలగొద్దనే నేడు కొనుగోలు కేంద్రం వద్ద కీలక చర్చలు:**

సర్పంచ్ రాయిలి భవానీ శేఖర్ ఈ వివాదాన్ని పరిష్కరించుకునేందుకు ఈరోజు ఉదయం 9 గంటలకు ఇనుగుర్తి మొక్కజొన్న కొనుగోలు కేంద్రం వద్ద ఇరువర్గాలు మరోసారి మాట్లాడుకోవాలని నిర్ణయించుకున్నాయి. ఈ నేపథ్యంలో చిన్నముప్పారం గ్రామానికి చెందిన మొక్కజొన్న రైతులందరూ బుధవారం ఉదయం పెద్ద సంఖ్యలో కొనుగోలు కేంద్రం వద్దకు చేరుకోవాలని గ్రామ సర్పంచ్ మరియు రైతు ప్రతినిధులు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మండల వ్యవసాయ శాఖాధికారులు వెంటనే స్పందించి ఈ హమాలీల సమస్యను పరిష్కరించాలని, తద్వారా అకాల వర్షాల ముప్పు పొంచి ఉన్నందున వేగంగా మొక్కజొన్న కొనుగోళ్లు జరిగేలా చూడాలని స్థానిక సర్పంచ్ రాయిలి భవాని శేఖర్ డిమాండ్ చేస్తున్నారు. వారు మాట్లాడుతూ. ఇదివరకే చిన్నముప్పారంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు మార్కపెడ్ వ్యవసాయ శాఖ అధికారులు అధికారికంగా ప్రకటించినట్లు తెలిపారు. అయినప్పటికీ రైతులంతా ఇబ్బంది పడకుండా అధికారులు చొరవ తీసుకుని సమస్య పరిష్కారం చేయాలని కోరుతున్నామన్నారు.



# కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బైరు అశోక్ గౌడ్ కు ఘన సన్మానం

**విధేయతకు దక్కిన గౌరవం, నియామకం పట్ల హర్షం**

**వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు**

*ఇనుగుర్తి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:*

మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల పరిధిలోని చిన్ననాగారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బైరు అశోక్ గౌడ్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. మహబూబాబాద్ జిల్లా సమన్వయకర్తగా, నెల్లికుదురు కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడిగా పార్టీకి ఆయన అందించిన విశేష సేవలను గుర్తించిన అధిష్ఠానం ఆయనకు ఈ కీలక బాధ్యతలను అప్పగించింది. అశోక్ గౌడ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియామకం జరిగిన సందర్భంగా చిన్ననాగారం గ్రామంలోని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అశోక్ గౌడ్ చేసిన నిరంతర కృషికి, అంకితభావానికి ఇది సరైన గుర్తింపు అని కొనియాడారు. ఆయన నియామకంతో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొందని, రాబోయే రోజుల్లో పార్టీ మరింత ముందుకు వెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని ఆకాంక్షి ంచారు. కష్టపడి పనిచేసే నాయకులకు కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడూ సముచిత స్థానం ఉంటుందని ఈ నియామకం ద్వారా మరోసారి స్పష్టమైందన్నారు. ఈ అభినందన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ వెలిశాల లక్షి ్మ దేవేందర్ రావు, మేచరాజుపల్లి ఉపసర్పంచ్ తాళ్ళపెల్లి వెంకన్న గౌడ్, చిన్ననాగారం గ్రామ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు దేశగాని వెంకన్న గౌడ్, నెల్లికుదురు కాంగ్రెస్ మండల నాయకులు రమేష్ గౌడ్ మరియు శివలాల్ నాయక్ పాల్గొన్నారు.






# క్షణికావేశం - సైబర్ మోసాలు యువతను నాశనం చేస్తున్నాయి: సీఐ సత్యనారాయణ...

**సరదాగా ఫోన్ వాడకం ప్రమాదాలకు దారిమత్తు**

**పదార్థాలకు దూరంగా ఉండాలని సూచన..**

*కేసముద్రం, ఏప్రిల్ 7: ప్రభాతవార్త.......*

యువత క్షణికావేశానికి లోనవకుండా జాగ్రత్తగా ఉండాలని, లేకపోతే అనవసరంగా కేసుల పాలయ్యే ప్రమాదం ఉందని కేసముద్రం సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం నాలుగో రోజు కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ, సెల్‌ఫోన్ వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, అనవసరమైన యాప్స్, ఆన్లైన్ గేమ్స్ వల్ల యువత అప్పుల పాలై తీవ్ర పరిణామాలకు దారి తీస్తున్నారని తెలిపారు. తెలియని లింకులను ఓపెన్ చేయడం ద్వారా వ్యక్తిగత సమాచారం సైబర్ నేరగాళ్లకు చేరుతుందని, ఓటీపీ వంటి గోప్య సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు చెప్పకూడదని సూచించారు. 'లోన్ వచ్చింది' వంటి పేర్లతో మోసగాళ్లు వల వేస్తారని, జాగ్రత్తగా లేకపోతే బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. డ్రైవింగ్ సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, చరవాణిని సరదాగా ఉపయోగిస్తూ ప్రమాదాలకు లోనుకాకూడదని సూచించారు. యువత మత్తు పదార్థాలకు బానిసై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, గంజాయి, డ్రగ్స్ వినియోగం కుటుంబాలకు కడుపుకోతలు మిగులుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సారంపల్లి దేవేంద్ర మోహన్ రెడ్డి మాట్లాడుతూ, సైబర్ నేరాలు మరియు మత్తు పదార్థాలపై గ్రామ ప్రజలకు చైతన్యం కల్పించిన సీఐ సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి ముందు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డా. జి. రమేష్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామ వీధులను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువ నాయకులు ఉదయ్, అధ్యాపకులు మైసయ్య, ప్రవీణ్, యాదగిరి, రవి, రాజు, మున్ని, రమాదేవి, మంజుల, సలీం, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.




# రౌడీ షీటర్ కు జీవిత ఖైదు......

**జనాలను భయపెట్టడం కొరకు కేసముద్రం రైల్వే స్టేషన్ లో అడుగుకునే అమాయక వ్యక్తి ని చంపి తల మొండం వేరు చేసిన రౌడీ షీటర్ అంగోత్ హరీష్ కు జీవిత ఖైదు..•**

*కేసముద్రం ఏప్రిల్ 7 ప్రభాతవార్త........*

...2020 సంవత్సరం ఆగస్టు నెల 23 వ తేది అర్ధరాత్రి ఒక 30 సంవత్సరాల అంగోత్ హరీష్, గిర్నీతండా, కేసముద్రం కి చెందిన వ్యక్తి ఒక రౌడీ గా మారి ప్రజలను భయభ్రాంతులకు గురించేస్తూ బ్రతకావాలెననే ఉద్దేశ్యం తో అన్యం పుణ్యం ఎరుగని అనంతపురం కి చెందిన బిచ్చగాడు వెంకన్న, 40 సంవత్సరాలు అను వ్యక్తి పారా తో కొట్టి చంపి కత్తి తో తల ను మొండెం నుండి వేరు చేసి, మొండెం ని కర్పూరపు గోపి ఖాళీ స్థలం లో తల ని కూరగాయలు అమ్మే లక్షి ్మ ఇంటి పక్కన పడేసి ఘటన లో అప్పటి శ్రీ. తీ. సతీష్ జుళివీ గారి పిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా అప్పటి మహబూబాబాద్ రూరల్ సీఐ లు గా పనిచేసిన రి వెంకటరత్నం మరియు శి. రవికుమార్ లు సాక్షాలు సేకరించి, నిందుతుని అరెస్ట్ చేసి, చార్జెషీట్ ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జి కోర్ట్ యందు ఫైల్ చేసినారు,



ఈ కేసు గత ఆరు నెలల క్రితం కోర్ట్ యందు విచారణకు రాగ శ్రీ శబరిష్. శి, ।శిళీ ఉత్తర్వుల మేరకు మహబూబాబాద్ దీళీశి శ్రీ తిరుపతి రావు పర్యవేక్షణలో కేసముద్రం సీఐ సత్యనారాయణ మరియు శ్రీ। లు క్రాంతి కిరణ్ మరియు నరేష్ లు ఈ కేసును ఛాలెంజ్ తీసుకొని ప్రతి సాక్షి విచారణకు ముందు బ్రీఫ్ చేయగా కోర్టు దిదీవీ అశోక్ రెడ్డి సాక్షులను కోర్ట్ లో ప్రవేశపెట్టి సరియైన సాక్షం ఇపించగా, పబ్లిక్ ప్రాసీక్యూటర్ కొంపెల్లి వెంకటయ్య గారు వాదనలు వినిపించడం జరిగింది, గౌరవ జిల్లా కోర్టు న్యాయమూర్తి ట్రీ అబ్దుల్ రఫీ కేసు సాక్షాలు లు పరిశీలించి ఈరోజు నిందితుడు అంగోత్ హరీష్ కు జీవిత ఖైదు మరియు 30 వేల రూపాయలు జరిమానా విధిచడం జరిగింది. ఇట్టి రౌడీ షీటర్ అంగోత్ హరీష్ పైన అక్రమ వసూలు, అట్టెంప్ట్ మర్డర్, గాయపరిచిన కేసులు, దొంగతనం మరియు ఆడవారిని వేధించిన 18 కేసులలో నిందితునిగా ఉన్నాడు, ఇట్టి రౌడీషీటర్ అంగోత్ హరీష్, తాను రౌడీ అని కేసముద్రం ఏరియాలో అందరిని బెదిరించి షాప్ వల్ల వద్ద డబ్బులు వసూల్ చేయడం ఇవ్వనివారిని కొట్టడం చేస్తుంటాడు, ఇతనిపై పిర్యాదు చేయడానికి కుడా ప్రజలు భయపడేవారు, సీఐ సత్యనారాయణ మరియు శ్రీ। క్రాంతి కేసముద్రం లో ఛార్జి తీసుకున్నాక ఈరోజు కేసు ను ఛాలెంజ్ గా తీసుకొని రౌడీ షీటర్ హరీష్ నుండి ప్రజలకు మరియు బిజినెస్ చేసుకునే వారికి ఇబ్బంది లేకుండా చూసుకునేలా చర్యలు తీసుకొని రౌడీషీటర్ కి యావజీవ కారాగారా శిక్ష పడేలా కృషి చేసారు వారి సేవలకు కేసముద్రం ప్రజలు కృతజ్ఞతలు తెలియచేసినారు.

## బ్లాక్‌లో అమ్ముతున్న సిలెండర్ల పట్టివేత

*గూడూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త*

డొమెస్టిక్ గ్యాస్ సిలండర్లను కస్టమర్లకు కాకుండా బయట బ్లాక్‌లో అమ్ముతుండడంతో దాడి చేసి పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ వసంత్‌కుమార్ తెలిపారు. వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని గ్యాస్



ఎజెన్సీకి చెందిన డెలివరి బాయ్ మంగళవారం తమ ట్రాలీలో తరలిస్తున్న గ్యాస్ సిలెండర్ల నుండి 5 గ్యాస్ సిలెండర్లను గూడూరులోని నెక్కొండ రోడ్డులో ఉన్న బతుకమ్మఘాట్ వద్ద కస్టమర్స్‌కు కాకుండా వేరే వారికి బ్లాక్‌లో విక్రయిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న గ్యాస్ సిలెండర్లను మహబూబాబాద్ సివిల్ సప్లయ్ డిటికి అప్పగించడం జరిగిందని, ఆ తర్వాత విచారణలో భాగంగా టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డి ప్రభాకర్, లక్ష్మారెడ్డి, డిటి సత్యనారాయణ, గూడూరు ఎస్ఐ గిరిధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి గ్యాస్ సిలెండర్లను తగు భద్రత నిమిత్తం కేసముద్రం గ్యాస్ ఎజెన్సీ వారి వద్ద భద్రపరచినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ నుండి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు సిలెండర్లను అక్కడే భద్రపరచనున్నట్లు సిఐ తెలిపారు.

## నియోజకవర్గం డిమాండ్‌తో డిఎస్‌ఎఫ్ఐ ప్రదర్శన

*గూడూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త*

పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో గూడూరును అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని డిఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో డిమాండ్ చేసారు. ఈమేరకు పట్టణంలోని బస్టాండ్ సెంటం ˉలో సంఘం జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల




ఇంచార్జి బానోతు రవీందర్ మాట్లాడుతూ గతంలో సమితి, తాలూకా కేంద్రంగా కొనసాగిన గూడూరును నియోజకవర్గంగా ఏర్పాటు చేయడానికి అన్ని అర్హతలు, అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం పలు ప్రభుత్వ శాఖలకు గూడూరు డివిజన్ కేంద్రంగా కూడా కొనసాగుతున్నదన్నారు. త్వరలో చేపట్టనున్న పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గూడూరుకు ప్రాధాన్యతనిచ్చి అసెంబ్లీ నియోజకవర్గం చేయాలని డిమాండ్ చేసారు. నియోజకవర్గాన్ని సాధించుకునే వరకు విద్యార్థి ఉద్యమాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సుమన్, శ్రీకాంత్, అంజన్న, వాసు, బాలాజి, వెంకటేష్, వీరన్న, చరణ్, మోహన్, ఈశ్వర్ పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

*గూడూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త*

గూడూరుకు చెందిన వరికుప్పల దేవేందర్‌కు సిఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.1.75 లక్షల చెక్కును సర్పంచ్ వాంకుడోతు సునితాకొమ్మాలునాయక్ మంగళవారం అందజేసారు. స్థానిక గ్రామపంచాయతి ప్రాంగణంలో నిర్వహించిన చెక్కు పంపిణి కార్యక్రమంలో ఉపసర్పంచ్ చంటి స్వామి, మైనారిటీసెల్ జిల్లా కార్యదర్శి ఎండి రసూల్, పొన్నం వెంకన్న, షాజహాన్, వార్డు సభ్యులు ఇనుముల యాకాంబ్రం, పత్తెం వెంకన్న, దారావత్ కిషన్, నక్క సతీష్, వాంకుడోతు జ్యోతి, భద్రమ్మ, మౌనిక పాల్గొన్నారు.



## కామారం సబ్ సెంటర్ కు రాష్ట్రస్థాయి అవార్డు ఆరోగ్య శాఖ మంత్రి అభినందన

*గంగారం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త*

గంగారం మండలంలోని కోమట్లగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కామారం సబ్ సెంటర్‌కు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా చొంగ్తు చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి అవార్డు ప్రదానం చేసారు.గర్భిణీ స్త్రీల ముందస్తు నమోదు త్వరగా



చేయడం తప్పని సరి ఏ ఎన్ సి పరీక్షలు, పూర్తి రోగనిరోధక టీకాలు కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంలో కామారం సబ్ సెంటర్ చూపిన విశిష్ట ప్రతిభకు గుర్తింపుగా సోమవారం కామరాం సెంటర్ ఏ ఎన్ ఎం, లు వెంకటలక్ష్మి ్ర, మల్లీశ్వరి, వెంకటేష్ లు మంత్రి చేతుల మీదగా అవార్డు అందుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి రాథోడ్ కామారం సబ్ సెంటర్ సిబ్బందిని అభినందించి, వారి కృషి ఇతర ఆరోగ్య కేంద్రాలకు ఆదర్శంగా నిలుస్తుందని, ఈ విజయానికి కృషి చేసిన ఆశా కార్యకర్తలు,ఏ ఎన్ ఎం లు సంబంధిత సిబ్బందిని ఆయన అభినందించారు.భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవలను కొనసాగిస్తూ ప్రజల ఆరోగ్యానికి మరింతగా తోడ్పడాలని ఆకాంక్షి ంచారు.

## ప్రజా కళలను బ్రతికించుకుందాం

*కొత్తగూడ, ఏప్రిల్ 7, ప్రభాత వార్త*

పాశ్చాత్య సంస్కృతికి వ్యతిరేకంగా ప్రజా కళలను కాపాడుకోవడంలో కళాకారులు, కళాభిమానులు ముందుండాలని ప్రముఖ కవి, వాగ్గేయ కళాకారుడు యోచన అన్నారు . మంగళవారం మండల కేంద్రంలో సిపిఐ (ఎంఎల్ )న్యూ డెమోక్రసీ పాలడు కృష్ణ స్మారక భవనంలో జరిగిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా 7వ మహాసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సమాజంలో ఆర్థిక రాజకీయ సాంఘిక జీవన విధానాల ప్రతిబింబమే సాంస్కృతికి పునాదని, సమాజం పై ప్రభావం కలగజేస్తూ వర్గ సమాజంలో ప్రజల సంస్కృతి!!!అనుకూలంగా ఉంటుందని తెలిపారు. కానీ ప్రభుత్వాలు దీనికి విరుద్ధంగా ప్రత్యామ్నాయంగా ప్రజా సంస్కృతిని దెబ్బతీసే పాశ్చాత్య సంస్కృతిని పెంపొందిస్తూ సమాజంలోని




ప్రజలందరి సంస్కృతిగా అదే ధర్మసంస్కృతిగా రుద్దుతున్నారని విమర్శించారు. వర్గ సమాజాల చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్రేనని, ప్రజా పోరాటాల నుండి పుట్టిన ప్రజా సంస్కృతే అరుణోదయ సంస్కృతని అన్నారు. కళ కళ కోసం కాదని ప్రజల కోసమని ప్రజల పక్షం వహించినప్పుడే ఆ కళలు!!!పదికాలాలపాటు అందరించబడతాయన్నారు. అనంతరం ఇ. శ్రీశైలం మాట్లాడుతూ పాలక పక్షాలు ప్రజా కళలను విచ్చిన్నం చేసి, పాశ్చాత్య కళలను ప్రోత్సహిస్తూ!!!తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. మహాసభకు ముందు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉదయగిరి జెండావిష్కరించి మాట్లాడుతూ అమర కళాకారులకు నివాళులర్పించారు. అనంతరం మండల కేంద్రం లో కళాకారులతో డప్పు డ్యాన్స్, కోలాట బృందం తో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ!!!రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మండల వెంకన్న, రాష్ట్ర నాయకులు మోకాళ్ళ మురళి కృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో చారి హరీష్, బుర్కా వెంకటయ్య, లింగ్య నాయక్,రాకేష్, నాగరాజు, రాజేష్ జామల పూర్ణచందర్ నాగేష్ రామచందర్ రాజా సురేందర్ పాల్గొన్నారు.

## వడ్డీ వ్యాపారం నుండి విముక్తి పరచాలి

*గంగారం ఏప్రిల్ 7,ప్రభాతవార్త*

దుబ్బగూడెం గిరిజనేతర్ల అక్రమ అధిక వడ్డీ వ్యాపారులకు వ్యతిరేకంగా లింగాల స్థూపం నుండి దుబ్బగూడం వరకు సోమవారం పాదయాత్ర చేసి సభ మహబూబాబాద్ జిల్లా తుడుం దెబ్బ అధ్యక్షులు కుంజ నర్సింగరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తుడుందెబ్బ జాతీయ అధ్యక్షులు ఈసం. సుధాకర్, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనేతరులు 1/70 1/66 పెసా 1996 చట్టాల ప్రకారం ఇచ్చినటువంటి అప్పులు వడ్డీకి వడ్డీ పెంచుకుంటూ ఆదివాసుల పైన మోపి వారి భూములను లాక్కొని మహిళలను అణచివేతకు గురి చేస్తున్నారని ఆరోపించారు. షెడ్యూల్ ఏరియా అంటే గిరిజనేతరులు గాలి కూడా పిలవడానికి వీలులేదని గిరిజనేతర్లు ఇచ్చినటువంటి అక్రమ అధిక వడ్డీ అప్పులను మాఫీ చేయడానికి దుబ్బగూడెం పిసా గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేసిందన్నారు. ఇట్టి తీర్మానాన్ని 29 శాఖల అధికారులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి దుబ్బగూడెం ఇతర గ్రామాల ఆదివాసీలకు బ్యాంకు లోన్లు క్రాప్ లోన్లు ఇవ్వాలని గిరినేతర్లు లాక్కున్న భూములను తిరిగి ఇప్పించాలని సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి సిద్దబోయిన లక్ష్మీ ్మనారాయణ ఉపాధ్యక్షులు కోడం వెంకటేశ్వర్లు రాష్ట్ర నాయకులు పడిగే నాగేశ్వరరావు సిద్ధబోయిన సంజీవ తాటి సునీల్ ఇక రామారావు కల్తి శేఖర్ గొంది వినయ్ సర్పంచ్ పూనెం సంధ్యారాణి, మాజీ ఎంపీటీసీలు మాజీ సర్పంచులు ఈ సం కాంతారావు సువర్ణపాక లక్ష ్మయ్య సువర్ణపాక నాగేశ్వరరావు పోలెబోయిన సమ్మయ్య సువర్ణపాక నరేందర్ పూనం సందీప్ సువర్ణపాక శ్రీను పాల్గొన్నారు.






## పొనుగోడులో పోలీసు కళాజాత

*గూడూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త*

మండలంలోని పొనుగోడు గ్రామంలో మంగళవారం రాత్రి పోలీసు



కళాజాత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఐ వినయ్‌కుమార్, ఎస్ఐ గిరిధర్‌రెడ్డిలు మాట్లాడుతూ పలు సామాజిక రుగ్మతలపై అవగాహన కలిగించారు. రోడ్డు భద్రత పాటించాలని, గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగానికి పాల్పడవద్దని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. మూఢనమ్మకాల పేరుతో హింసకు పాల్పడి కేసుల పాలు కావద్దన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. కళాబృందం కళాకారులు తమ ఆట పాటలతో పలు అంశాలపై ప్రజలకు వివరించారు.

## పోలీసు స్టేషన్ ను సందర్శించిన ఎస్పీ

*గూడూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త*



గూడూరు పోలీస్ స్టేషన్ను జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ మంగళవారం సందర్శించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, స్టేషన్ గదులు, రికార్డుల నిర్వహణ, పని విధానాన్ని పరిశీలించారు. స్టేషన్‌లో సిబ్బంది సంఖ్య, వారి విధుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతి గురించి గూడూరు ఎస్సై గిరిధర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అలాగే పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు, గ్రామపంచాయతీల వివరాలు, అక్కడ అమలు చేస్తున్న భద్రతా చర్యలపై సమీక్షి ంచారు. అనంతరం మండలంలోని పోనుగోడు గ్రామాన్ని సందర్శించి గ్రామంలో హెల్మెట్ వినియోగం అమలు, సీసీ కెమెరాల ఏర్పాటు వాటి పర్యవేక్షణ విధానాన్ని పరిశీలించారు. గ్రామస్థులు తీసుకున్న నిర్ణయాలతో హెల్మెట్ వినియోగం కచ్చితంగా అమలవుతున్న తీరు, గ్రామమంతా సీసీ కెమెరాల కవరేజీలో ఉండడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, గ్రామ భద్రతలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రతి గ్రామం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ వినియోగం తప్పనిసరిగా పాటించాలనిప్రజలు, పోలీస్ శాఖ కలిసి పనిచేస్తే గ్రామాలను నేర రహితంగా, సురక్షి తంగా మార్చుకోవచ్చని అన్నారు.

# వేయి స్తంభాల దేవాలయానికి రూ.14.14 కోట్ల నిధుల విడుదల

**దేవాలయం అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం**

**పదేళ్లలో వరంగల్ నగరానికి ఒక్క రూపాయి ఖర్చు చేయని బీజేపీ, బీ ఆర్ ఎస్ నేతలు మాట్లాడటం సిగ్గుచేటు....**

**కేంద్ర టూరిజం మరియు పురావస్తు శాఖ నిధులు..**

**ఎమ్మెల్యే నాయిని,ఎంపీ కావ్య..**



హన్మకొండ బ్యూరో.ఏప్రిల్ 7. ప్రభాత వార్త.

చారిత్రక ప్రాధాన్యం గల రుద్రేశ్వర స్వామి వేయి స్తంభాల దేవాలయం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు సాధిస్తామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు తెలిపారు.మంగళవారం నాడు వేయి స్తంభాల దేవాలయాన్ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య గారితో సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో అనిల్ కుమార్, ప్రధాన అర్చకులు ఉపేంద్ర శర్మ స్వామివారి తీర్థప్రసాదం, శేష వస్త్రాలు అందజేశారు.ఇటీవల కేంద్ర టూరిజం మరియు పురావస్తు శాఖ నుంచి విడుదలైన రూ.14.14 కోట్ల నిధుల వినియోగంపై అధికారులు వివరాలు అందించారు. ఈ నిధులతో ఆలయంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, సెంట్రల్ లైటింగ్, గార్డెన్ అభివృద్ధి, కోనేరు పునరుద్ధరణ, భక్తులకు సౌకర్యాల కల్పన వంటి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే నందీశ్వర మండపం ప్రాంతంలో అభివృద్ధి పనులు కూడా చేపట్టనున్నట్లు వెల్లడించారు.ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో ఈ దేవాలయానికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. ప్రస్తుతం కేంద్రం నుంచి నిధులు విడుదల కావడం సంతోషకరమని, ఈ నిధులను పారదర్శకంగా వినియోగించి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు అందరం ఎంపీ కడియం కావ్య గారి నాయకత్వంలో ఢిల్లీలో కేంద్ర మంత్రి గారిని కలిసి జిల్లాలో ఉన్న చారిత్రక ఆలయాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని,అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరడం జరిగిందని అన్నారు.ఆలయ అభివృద్ధికి నిధులు విడుదల పట్ల బీజేపీ పార్టీ నేతలు తామే స్వయంగా తీసుకొచ్చమని అనడం హాస్యాస్పదం అని అన్నారు.గడిచిన పదేళ్ల కాలంలో రాష్ట్రంలో బీ ఆర్ ఎస్,కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కలిసి పనిచేసనప్పుడు నిధులు ఎందుకు తీసుకురాలేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి టాక్స్ ల రూపంలో రూపాయి ఇస్తే తిరిగి కేవలం 30 పైసలు మాత్రమే ఇస్తున్నదని అన్నారు.10 ఏళ్ల కాలంలో ఒక్కరోజైనా అభివృద్ధి కోసం ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి నిధులు మంజూరు చేయాలని అడిగిన దాఖలాలు లేవని విమర్శించారు.ఎంపీ కావ్య నేతృత్వంలో పలుమార్లు ఢిల్లీలో మంత్రులు కలుస్తూ రావాల్సిన నిధుల పట్ల సమిష్టి కృషి చేశామని అన్నారు.అదేవిధంగా దేవాలయం ముందు భాగ సుందరీకరణ కోసం రూ.30 కోట్ల నిధులు కేటాయించగా, అందులో ఇప్పటికే కొంత పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. భవిష్యత్తులో యునెస్కో గుర్తింపు పొందేలా ఆలయాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు.దేవాలయం పరిసర ప్రాంత అభివృద్ధి కోసం స్థానిక గృహ యజమానులు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్, డ్రైనేజ్, స్మశాన వాటిక, శంకుస్థాపన

ఏప్రిల్ 07(ప్రభాతవార్త)కాజిపేట్ మండల్



వర్ధన్నపేట నియోజకవర్గం అల్లిపురంలో 44వ డివిజన్ అధ్యక్షులు, రాజారపు.స్వామి ఆధ్వర్యంలో సిసి రోడ్ డ్రైనేజ్ స్మశాన వాటిక శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మన వర్ధన్నపేట శాసనసభ్యులు విశ్రాంతి ఐపిఎస్ అధికారి, కేఆర్.నాగరాజు విచ్చేసి శిలాఫలక ఆవిష్కరణ చేశారు. అదేవిధంగా గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటూ ఇందిరమ్మ ఇండ్లు పింఛన్లు లేనివారికి పింఛన్లు కూడా ఇస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో 44 డివిజన్ కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మండల కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ డైరెక్టర్ గా పదోన్నతి పొందిన అశోక్ కుమార్ కు ఘన సన్మానం

ప్రభాతవార్త సుబేదారి:

అతి చిన్న వయసులోనే స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్(డీ డీ)గా పదోన్నతి పొందిన గుగులోతు అశోక్ కుమార్ ను ఈ సందర్భంగా కోచ్‌లు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. హనుమకొండ జిల్లా యువజన క్రీడాభివృద్ధి అధికారి పనిచేస్తున్న అశోక్ కుమార్ సాధించిన ఈ అరుదైన విజయాన్ని ప్రశంసిస్తూ పుష్పగుచ్ఛాలు అందించి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. కృషి, పట్టుదల, అంకితభావంతో ఉన్నత స్థానాన్ని అందుకోవచ్చని అశోక్ కుమార్ సార్ నిరూపించారని కొనియాడారు.యువ వయసులోనే ఈ స్థాయికి చేరుకోవడం ఎంతో గర్వకారణమని, స్పోర్ట్స్ రంగంలో ఆయన నాయకత్వం మరింత అభివృద్ధికి దోహదపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. యువత తమ లక్ష్యాల కోసం కష్టపడి ముందుకు సాగాలని ఆయన ప్రయాణం ఒక స్పష్టమైన సందేశమని పేర్కొన్నారు. ఈ సత్కార కార్యక్రమంలో పలువురు కోచ్‌లు, సిబ్బంది పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.



# తెలంగాణ విద్య కమీషన్ 2026 నివేదికను సవరించాలి

**యుఎస్ఎఫ్ఐ నిర్వహించిన చర్చగోష్ఠి లో వక్తల డిమాండ్**

ఏప్రిల్ 07, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్ :

మంగళవారం భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ పట్టణంలోని స్థానిక సిటీ మహిళా డిగ్రీ కళాశాలలో చర్చ గోష్టి జిల్లా అధ్యక్షులు ఆకుల మనోజ్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ చర్చగోష్ఠి కి కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ తిరునారి శేషు, వీరస్వామి, యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి, మాదం తిరుపతి, ఐకఫ్ రాష్ట్ర కన్వీనర్, మోర్తాల చందర్రావు, పి డి ఎస్ యు రాష్ట్ర సహాయ కార్యదర్శి నరసింహ రావు, పిడిఎస్యు ఉమ్మడి జిల్లా కార్యదర్శి మర్రి మహేష్, డి ఎస్ ఏ నాయకులు శివ, బి ఎస్ ఎఫ్ కాకతీయ యూనివర్సిటీ ఇన్చార్జ్ బోట్ల మనోహర్, ప్రజాసంఘాల నాయకులు హంసారెడ్డి, బాలికల విభాగం నాయకురాలు అంజలి, రేష్మ తదితరులు చర్చ గోస్టిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చగోష్ఠికి హాజరైన వక్తలు మాట్లాడుతూ తెలంగాణ విద్యా కమీషన్ 2026 తెలంగాణలో విద్యా విధానాన్ని సములంగా మార్చాలని సంకల్పంతో రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఆకునురి మురళి చైర్మెన్ గా ఇతర సభ్యులతో ఏర్పాటు చేసిన కమీషన్ ఇచ్చిన నివేదికలో ఈ క్రింది అంశాలను సవరించాలి అని చర్చ గోస్ట్ లో పాల్గొన్నవారు అన్నారు.ప్రాథమిక విద్యలో కి.మి మీటర్, మూడు కి. మి మీటర్ మరియు ఐదు కి.మీటర్ల పరిది లో పాఠశాలలను ఏర్పాటు చేయాలి, విధ్యార్థుల సంఖ్యను ప్రాతిపాదిక చేసుకొని స్కూల్లను ఏర్పాటు చేయాలి. మండల పరిధిలో ఏర్పాటు చేయబోవు పాఠశాలల యొక్క సంఖ్య పరిమితిని తొలిగించాలి.మధ్యాహ్న భోజనముప్రభుత్వ పాఠశాలలలో మద్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం ఆద్వర్యంలో నిర్వహించాలి. మద్యాహ్న భోజన నిర్వహణ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి . వారినీ ప్రభుత్వమే నియమీంచాలి. అక్షయ పాత్ర అనే మద్యవర్తిత్వాన్ని తొలిగించాలి. మద్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా నిర్వహించడం కోసం ప్రతి పాఠశాలకు ఒక నాన్ టీచింగ్ పోస్టును ఏర్పాటు చేయాలి. జిల్లా విద్య బోర్డు చైర్మన్ గా ఉండబోతున్న కలెక్టర్ కి బదులుగా ఐఎఎస్ స్థాయికి తగ్గని మరో అధికారిని నియమించాలి. విద్యా బోధనలో తెలుగు భాష మాధ్యమము విధిగా ఒక సబ్జెక్ట్ గా ఉండాలి. వికలాంగులకు అందించే విద్యపై ఎలాంటి స్పష్టతను నివ్వలేదు. ప్రభుత్వ బోధనలో సాంకేతిక వైజ్ఞానిక ప్రయోజిత కార్యక్రమాలను ప్రసారంలో భాగం చేయాలి..ఆర్టికల్ 51ఎ సైంటిఫిక్ టెంపర్ మెంట్ మీద కమీషన్ నివేదికలో ఎక్కడ ప్రస్తావన లేదు. ఎస్ ఎస్ సి !! ఇంటర్మీడియట్ బోర్డుల విలీనం విరమించాలి. 10+2+3 విధ్యా విధానం యధాతదంగా కొనసాగించాలి.ఇంటర్మీడియట్ విద్యకి రాష్ట్రంలో ఒక విద్యా సంస్థకు ఎంత మంది విద్యార్థులతో ఎన్ని బ్రాంచీలు ఏర్పాటు చేసుకోవాలనే విషయంలో కూడా కమీషన్ ఎక్కడ ప్రస్తావించలేదు. అలాగే ఫీజుల నియంత్రణ చెయ్యాలి. డిగ్రీ విద్యను 3 సం.ల కాల పరిమితి కాకుండ, 4 సం.ల కాల పరిమితి అనే సవరణను ఉపసంహరించాలి. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలకు అనుబంధంగా సంఖ్యతో సంబంధం లేకుండా సంక్షేమ హాస్టల్లను ఏర్పాటు చేయాలి. ఈ కమీషన్విద్యార్థి సంఘం ఎన్నికలతో పోటి చేసే విధ్యార్థి నాయకులకు వయస్సు పరిమితి 35 సం.లకు ఉండాలి. విద్యార్థి సంఘ ఎన్నికలలో పోటీ చేయబడు విధ్యార్థి నాయకులకు నేర నిర్ధారణ కాకుండ నేరారోపణ పేరుతో పోటిచేయకుండ ఆంక్షల చేయబడు సూచనను సవరించాలి. యునివర్సిటి పాలక మండళ్లకు ఎంపిక చేయబడే వారి విద్యార్థి సంఘ నాయకులకు ప్రాతినిధ్యం కల్పించాలి. పాలిటెక్నిక్ విద్య పూర్తి చేసిన వారికి తదుపరి డిగ్రి కోర్సులో ల్యాటరల్ పద్దతిలో ఎంట్రెన్స్ కల్పించాలి.విద్యరంగంలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులలో కాంట్రాక్టు నియమాకాలు రద్దు పరచి శాశ్వత ప్రాతిపాదికగా నియమకాలు జరపాలి. అలహాబాద్ హైకోర్టు తీర్పు అనుగుణంగా, ప్రభుత్వం నుండి ఆర్థికంగా లబ్దిపొందిన ప్రభుత్వాధికారుల పిల్లలను విధిగా ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని చేసిన తీర్పును అమలు పర్చాలని కమీషన్ లో ప్రస్థావించక పోవడం గమనార్హం. ప్రైవేటు పాఠశాలలు మరియు కళాశాలలు ప్రభుత్వ పాఠశాలలకు ఏర్పరిచిన రూల్స్ ప్రకారంగా ప్రైవేటు రంగంలోని పాఠశాలలకు, సదుపాయాలకు గురించి ఆటస్థలాలు, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్స్ కు అర్హత కలిగిన టీచర్ల నియమాకాలపై కూడ అవసరమైన సిబ్బందిని శాశ్వత ప్రాతి పాదికపై నియమించుటకు కమీషన్ సిఫారసులు చేయవలసి యున్నది. ప్రైవేటు రంగంలోని పాఠశాలలు మరియు కాలేజీలలో దాని విద్యార్థులు చెల్లించే ఫీజులను ఆయా స్కూళ్ల కాలేజీల యజామాన్యాలు ఎవరికివారు వారి వారి ఇష్టానుసారంగా పెంచుకోకుండ ప్రభుత్వం సూచనల మేరకు నిర్ధారించిన ఆయా పాఠశాలలు మరియు కాలేజీల యాజమాన్యాలు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మాత్రమే పెంపుదల చేసే విధంగా కమీషన్ సూచనలు చేయకపోవడం గమనార్హం.ప్రైవేటు రంగంలోని పాఠశాలలు మరియు కాలేజీలు ఏ యేడు కాయేడు అర్జించిన లాభాలలో యాజమాన్యాలు కేవలం 50 శాతం మాత్రమే తీసుకోవాలి, మిగతా లాభాన్ని పాఠశాలల మరియు కాలేజీల ఎదుగుదలకు తోడ్పడుతున్న టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ యొక్క జీతభత్యాలకు మరియు విధ్యార్థులకు అవసరమగు మోలిక వసతులు ఏర్పాటు చేయటానికి ఖర్చు చేయుటకు కమీషన్ తన నివేదికలో ప్రస్తావించకపోవడం అనేది కూడ ఆలోచించాలని అన్నారు విద్యకు సరైన బడ్జెట్ కేటాయించకుండా ప్రభుత్వాలు వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. బడ్జెట్ కేటాయించకుండా ఏ కమిషన్లు ఏర్పాటు చేసివిజయవంతంగా విజయవంతంగా ముందుకు పోదని తెలిపారు. ఈ కమిషన్ అశాస్త్రీయంగా ఉందని కాబట్టి దీన్ని సవరించాల్సిన అంశాలు చాలా ఉన్నాయని హాజరైన వ్యక్తులు తెలిపారు. ఐక్యంగా విద్యా రంగ అయి అభివృద్ధి కోసం ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల మనోజ్, రాజేష్ నాయక్, జిల్లా నాయకులు ప్రశాంత్, సుమన్, ప్రభు, కిరణ్, రాకేష్. అంజలి తదితరులు పాల్గొన్నారు